

పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను వేస్తున్న విద్య, వైద్య శాఖల సిబ్బంది

95 శాతం మందికి నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 17 : ఏడాది నుంచి 19 ఏళ్ల వయసులోపు విద్యార్థులను నులి పురుగుల నుంచి రక్షించేందుకు ఉద్దేశించిన అల్బెండజోల్ మాత్రల పంపిణీని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్, విద్యా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించారు. మొత్తం 4,04,525 మంది విద్యార్థు లకు మాత్రలను పంపిణీ చేయాలన్న లక్ష్యంలో 95 శాతం (3,86,303) మందికి మంగళవారం మధ్యాహ్న భోజన విరామానంతరం అందజేసి, నమిలించి మింగించినట్టు రాష్ట్రీయ బాలస్వస్థ కార్యక్రమం (ఆర్బీఎస్కే) జిల్లా ప్రోగ్రాం మేనేజర్ బొప్పన నరేష్ వెల్లడించారు. మాత్రలు నమిలి మింగిన విద్యార్థుల నుంచి ఎలాంటి అవాంఛనీయ పరిణామాలు తలెత్తలేదని వివరించారు. మాత్రలు తీసుకోని విద్యార్థులకు ఈ నెల 25న మాత్రలను నమిలి మింగించడం ద్వారా నూరుశాతం ప్రోగ్రాంను విజయవంతంచేస్తామన్నారు. స్థానిక గజవల్లివారి చెరువు కృష్ణదేవరాయ మున్సిపల్ పాఠశాలలో నిర్వహించిన నులిపురుగు నివారణ మాత్రల పంపిణీని జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు పర్యవేక్షించారు. విద్యాధికారులు రంగయ్య, నరసింహమూర్తి, ఆర్బీఎస్కే జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ నరేంద్రకృష్ణ, ఆరోగ్యకార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు విద్యార్థులకు రెండో టీచర్ కేటాయింపు !

ఆగిరిపల్లి, సెప్టెంబరు 17: ఆగిరిపల్లి మండలం పాత సూరవరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఐదు. ప్రస్తుతం ఇక్కడ ఒక ఉపాధ్యాయుడు పనిచేస్తున్నారు. తాజాగా జరిగిన సర్దుబాటులో భాగంలో ఈ పాఠశాలకు రెండో ఉపాధ్యాయుడిని కేటాయించారు. అంటే ఐదుగురు విద్యార్థులకు ఇద్దరు మాస్టార్లు పాఠాలు చెబుతారన్నమాట. దీనిపై మండల విద్యాశాఖతో పాటు విద్యార్థుల్లోనూ తీవ్ర చర్చనీ యాంశమైంది. ఎంఈవో సర్వేశ్వరరావును వివరణ కోరగా ఈ నియామకం డీఈవో కార్యాలయం నుంచే జరిగిందని చెప్పారు. విషయాన్ని వారి దృష్టికి తీసుకుని వెళతామని చెప్పారు.

బతుకు భారంగా..



- వరుస వరదలు, వర్షాలతో పెరిగిన కష్టాలు
- రోజు వారీ పనిలేక ఖాళీ కడుపులతోనే
- దారీ తెన్ను తెలియక వందల కుటుంబాలు
- పని చూపిస్తే బతుకుతామంటూ వేడుకోలు

పనుల్లేక ముంపు మండలాలు విలవిల

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

తెలంగాణలో అంతర్భాగంగా వున్న ముంపు మండలాలు కుక్కునూరు, వేలేరుపాడుల్లో ప్రజలంతా ఇతరుల మాదిరిగా బతుకీడ్చుకొచ్చిన వారే. తమకంటూ ఉన్న అరకొర ఎకరా భూమితో సాగు చేసిన వారే. తిండి గింజల కోసం వెతుకులాడిన వారే. పొరుగూళ్లకు వెళ్లి కూలి నాలీ చేసి కుటుంబాన్ని ఈడ్చుకొచ్చిన వారే. కాయకష్టం నమ్ముకుని వరదలకు ఎదురేగిన వారే. అడపాదడపా వచ్చిపడే గోదావరి తల్లి దూకుడు ముందు సాష్టాంగ నమస్కారాలతో మొక్కినవారే. రాను రాను ఈ గ్రామాలు కాస్తా ముంపు గ్రామాలయ్యాయి. 1984 నుంచి ఆరంభమై 2014 నాటికి అసలు సిసలైన స్వరూపమే మారిపోయింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణమే దీనికి ప్రధాన కారణం. ఒకప్పుడు ఈ రెండు మండలాల ప్రజల్లో అత్యధికులు కొత్తగూడెం, అశ్వరావుపేట, భద్రచలమో అప్పుడో ఎప్పుడో తరలిపోయేవారు. చేతికందిన పని చేసుకుని కుటుంబాన్ని సాకేవారు. రానురాను పరిస్థితులు తారుమారై ఈ రెండు మండలాలను విభజిత తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోకి విలీనం చేశారు. అక్కడి నుంచి వీరికి కష్టాలు మొదలయ్యాయి. 2022లో ఎగువ కాఫర్ డ్యామ్ నిర్మాణం కారణంగా వరద ముంపు మండలాల వైపు చొచ్చు కొచ్చినట్టు ఆరోపణలు ఉన్నాయి. భద్రాద్రి వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసే నాటికే ఈ మండలాల వైపు వరద కమ్ముకొచ్చింది. తర్వాత మళ్లీ తిరిగి ఈ మధ్యనే వరుసగా మూడు నెలల్లో మూడుసార్లు గోదావరి వరద దండెత్తింది. ఇప్పటికే రోజువారి బతుకు కష్టమైన తరుణంలో ఏదొక రూపంలో స్థానికులు నెట్టుకొస్తుండగానే భారీ వర్షాలు, వరదలు, ఆఖరుకి వాగులు కూడా ఊళ్ళ మీద పడ్డాయి. వంద రోజులకుపైబడే ఇలాంటి విపత్కర పరిస్థితులు ఎదురవడంతో సాధారణ జనం బతుకు కష్టమైంది. ఇక్కడ పునరావాసం పేరిట జీలుగుమిల్లి, పోలవరం, బుట్టాయిగూడెం మండలాల్లో పునరావాస కాలనీలు నిర్మించారు. వీటిలోకి వెళ్లి బతకాల్సిందిగా ఇంతకు ముందే అధికారులు పదేపదే ఆదేశించేవారు. ఇంతవరకు బానే ఉన్నా ఉన్న ఊరిని, పెరిగిన ప్రాంతాన్ని, బతుకునిచ్చిన భూమిని వదల్లేక.. అక్కడి నుంచి కదల్లేక చివరి క్షణం వరకు వానొచ్చినా.. వరదొచ్చినా ఇక్కడే బతికి తీరుతామనే ధైర్యంతో అనేక కుటుంబాలు వున్నాయి.

ఇప్పుడేం జరిగిందంటే..

చాన్నాళ్ళ నుంచి.. ఇక్కడో నరకం. బతుకు మీద కొండంత ధైర్యంతో ఇప్పటి వరకు వరదతో యుద్ధం చేస్తూనే వచ్చిన ముంపు మండలాలకు చెందిన కుటుంబాలు ఒకింత అలసిపోయాయి. ఏకంగా ఈ మధ్యకాలంలో గుక్కతిప్పుకోనీయకుండా వరుసగా వచ్చి పడుతున్న వరదలతో ఇప్పుడు అనేక కుటుంబాలు రోజువారి బతుకు కష్టంగా మారింది. వేలేరుపాడు మండలంలో ఓ వైపు పెదవాగు ప్రాజెక్టుకు గండిపడడం, రుద్రంకోట నుంచి వేలేరుపాడు వరకు ఎక్కడికక్కడ మార్గాలు విచ్ఛిన్నమయ్యాయి. ఈ ప్రాంతాల్లో రాకపోకలే అదృశ్యమయ్యాయి. ఓ వైపు మరమ్మతులు చేస్తుంటే మరో వైపు ఒకదానివెంట మరొకటి వరదలు వచ్చి పడుతూనే ఉన్నాయి. ఈ పరిస్థితి నుంచి ఒక రోజు కాకపోయినా ఇంకో రోజైన ఒడ్డెక్కుతామన్న ముంపు గ్రామాల ప్రజలు ఆశలు ఈ మూడు మండలాల్లో ఆవిరైపోయాయి. అత్యధికంగా కుక్కునూరు, వేలేరుపాడుల్లో గిరిజన కుటుంబాలే ఎక్కువ. వీరిలో కొంత మంది గోదావరిని నమ్ముకున్న వారు కొందరైతే సమీప అటవీ ప్రాంతాన్ని నమ్ముకుని బతుకీడ్చుకొస్తున్న వారు ఇంకొందరు. అదీ ఇదీ కాదంటే పొరుగున ఉన్న పట్టణ ప్రాంతాలకు వెళ్లి బతికేందుకు అవసరమైన కూలి పనులు చేసుకునే వారే. ఈ తరహా కుటుంబాలన్నీ వరుస వరదలతో ఇరుక్కుపోయాయి. ఈ రెండు మండలాల్లో అక్కడక్కడ జరిగే వ్యవసాయ పనులకు నిత్యం వారినో వీరినో కూలి పనులకు పిలిచేవారు. ఇప్పుడు అర్ధంతరంగా వరుస వరదలతో పంటలు వేసే పరిస్థితి లేకుండా పోయింది. ప్రతీ ఊరిలోను వ్యవసాయాన్ని నమ్ముకుని ఉన్న వారంతా ఏమీ చేయలేక ప్రభుత్వం ఇచ్చే రేషన్ బియ్యంతోనే ఇప్పటి వరకు గడుపుకుంటూ వస్తున్నారు. ప్రభుత్వం వరద సమయంలో అంతో ఇంతో సాయపడుతున్నా వారంతా అత్యల్పమే అయినప్పటికి బతకడానికి అవసరమైన సౌకర్యాలేవీ వేల మందికి అందుబాటులో లేకుండాపోయాయి.



• ఉపాధి కోసం వినతి

'మాకు వరదలు కొత్తేమీ కాదు. గోదావరిని నమ్ముకుని ఉన్నవాళ్ళం. పదేళ్ళుగా అలసిపోయాం. మాకు ఉపాధి చూపించండి. మేం.. ఏం అడిగినా పరిహారమంతా ఇచ్చేశాం.. కాబట్టి ఇక్కడ ఉండడానికి వీల్లేదన్నట్టు గదమాయిస్తున్నారు. మాకు రావాల్సిన పరిహారం ఇంకా ఉంది. మమ్మల్ని తరలించడం ఒక్కటే కాదు. మాకు బతికేందుకు అవసరమైన ఉపాధిని చూపించండి' అంటూ ఇటీవల వరద ప్రాంతాలను సందర్శించిన కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి ఎదుట స్థానికులంతా తమ కష్టాలను వారి ఎదుట ఉంచారు. ఇదే కోణంలో ఇప్పుడు వందలాది మందికి రోజు వారి కూలి లేక, కనీసం ఇల్లు గడవక ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితి నుంచి కుటుంబాలను ఒడ్డెక్కించేందుకు యంత్రాంగం తక్షణ చర్యలు తీసుకోవాలి. పూట గడవడం కష్టంగా మారిన కుటుంబాలను గుర్తించాల్సింది పోయి మీకంతా ఇచ్చేశాం బయల్దేరండంటూ చిన్నచూపు చూడడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.

పనీ లేదు.. తిండీ లేదు



నేను ట్రాక్టర్ డ్రైవర్‌ను. ఆ పని లేకపోతే ఇంకో కూలి చేసుకుంటా. నేను, నా కుటుంబం ఇలా వెతుకుతూనే ఉంటాం. మూడు నెలలుగా వర్షాలు, వరదలు. వ్యవసాయ పనుల్లేవు. ట్రాక్టర్ నడిపేందుకు ఎవరూ పిలవడం లేదు. కూలికి వెళ్దామంటే ఇంకా పనులు మొదలు కాలేదంటూ చెబుతున్నారు. ఇంకెంత కాలం పడుతుందో తెలియడం లేదు. వరదలప్పుడు అన్ని గ్రామాలకు బియ్యం ఇచ్చారు. నా కుటుంబానికి ఇవ్వలేదు. ఇల్లు గడవాలంటే కష్టంగా ఉంది. చేతినిండా పనిలేదు, కడుపు నిండా తిండిలేదు.

- వరక వెంకటేశ్వర్లు, నడిమిగొమ్ము

కడుపు కాలుతోంది



నేను కూలీనాలీ చేసి బతుకుతాను. మూడు నెలలుగా వరదలు, వర్షాలు. ఏం చేయాలో అర్థం కావడం లేదు. ఇప్పటికే మా కుటుంబంలో పనికి వెళ్ళడానికి మేమంతా సిద్ధంగా ఉన్నా పనే దొరకడం లేదు. మాకు ఇతర ఆదాయాలేవీ లేవు. కొంతలో కొంత ఉపాధి హామీ పనులంటూ ఉంటే అవైనా కలిసొచ్చేవి. కాని అవీ లేవు. ఏ వైపు మాకు నయాపైసా దక్కే అవకాశం లేకుండా పోయింది. మాలాంటి కుటుంబాలన్నీ ఎలా బతకాలి. ఎన్నాళ్ళిలా కష్టాలు పడాలి. వ్యవసాయ కూలీలను ఆదుకోవాల్సిందే. ఇంతకంటే మరో మార్గం లేదు.

- బుర్రి కుమారస్వామి, తాట్కూరుగొమ్ము

ఇంటికి అనుమతి తీసుకుని..



షాపులు కట్టేశారు

- సెలవులో జంగారెడ్డిగూడెం టీపీవో
- ఎమ్మెల్యే హెచ్చరించినా విధుల్లో చేరలేదు
- నిబంధనలకు విరుద్ధంగా భవనాలు
- అనుమతి తీసుకున్నది ఒకటి.. కట్టింది మరొకటి.. ఫిర్యాదుల రాకతో నిలిపివేత

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 17: సామాన్యుడు చిన్న రేకుల షెడ్డు వేసుకుంటే నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నాడని అధికారులు హడావుడి చేసి, దానిని కూల్చే వరకు నిద్రపోరు. అలాంటిది జంగారెడ్డిగూడెంలో కొందరు కొన్ని నెలలుగా అక్రమ భవనాలను నిర్మిస్తూ మునిసిపాలిటీ ఆదాయానికి గండి కొడుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇందుకు ఉదాహరణ.. పట్టణంలోని పాత బ్రేక్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం వెనుక ఉన్న సౌజన్య అండ్ సాయిలక్ష్మీనగర్‌లో ఒక వ్యక్తి 2022లో గృహ నిర్మాణానికి మున్సిపాలిటీలో ప్లాన్ అప్రూవల్ తీసుకున్నారు. ఆ స్థలంలో ఇంటికి బదులుగా ఏడు షాపుల కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించారు. మరోషాపు ముందుగానే నిర్మించి షట్టర్ పెట్టించారు. కాంప్లెక్స్ పూర్తయ్యే వరకు టౌన్ ప్లానింగ్ అధికారులు కన్నెత్తయినా చూడలేదు. ఇలాంటివి చాలానే వున్నా అడిగేదెవరు? టౌన్ ప్లానింగ్ అధికారి (టీపీవో) దీర్ఘకాలంగా సెలవుపై ఉన్నారు. ఇన్‌చార్జిని నియమించలేదు. రెండేళ్లుగా టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ పోస్టులో ఎవరూ చేరలేదు. ఫలితంగా ఈ విభాగం అస్తవ్యస్తంగా మారింది. టౌన్ ప్లానింగ్‌లో పూర్తి అనుభవం లేని సాధారణ సచివాలయ టౌన్ ప్లానింగ్ సెక్రటరీకి టీపీబీవో బాధ్యతలు అప్పగించారు. దీనిపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పది రోజుల క్రితం మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే టౌన్ ప్లానింగ్ అధికారి విధుల్లో చేరకపోతే వేరే వారిని నియమిస్తానని హెచ్చరించారు. అయినా చేరలేదు. ఈ క్రమంలో ఎస్ఎస్ నగర్‌లో రెసిడెన్షియల్ అనుమతి తీసుకుని కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్న భవన నిర్మాణాన్ని అడ్డుకుని, భవన యజమానిపై చర్యలు తీసుకోవాలని రాతపూర్వకంగా మున్సిపల్ ఛైర్మన్, కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు 27వ వార్డు కౌన్సిలర్ నేట్రు సుబ్బలక్ష్మి తెలిపారు. కమిషనర్ నరేంద్రకుమార్ వివరణ ఇస్తూ రెసిడెన్షియల్ ప్లాన్‌కు అప్రూవల్ తీసుకుని కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించడంపై నోటీసు ఇచ్చి పనులను నిలిపివేశాం. భవన యజమానిపై కోర్టులో చార్జిషీట్ ఫైల్‌చేసి చర్యలు తీసుకుంటా'మన్నారు.

ఐటీఐలలో అడ్మిషన్లకు నాలుగో విడత కౌన్సెలింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 17: జిల్లాలోని ఐదు ప్రభుత్వ, 14 ప్రైవేటు ఐటీఐలలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి మిగిలిన సీట్ల భర్తీకి నాలుగో విడత కౌన్సెలింగ్‌కు విద్యార్థులు ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా దరఖాస్తులను ఈ నెల 26లోగా పంపాలని స్థానిక ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, అడ్మిషన్ల కన్వీనర్ పి.రజిత ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అనంతరం అప్లికేషన్ కాపీ ప్రింట్, విద్యార్హతలు, ఇతర ధ్రువీకరణ పత్రాల ఒరిజినల్స్‌ను వెరిఫికేషన్ నిమిత్తం విద్యార్థులు తాము ఎంచుకున్న సంబంధిత ఐటీఐలో ఈ నెల 27వ తేదీ సాయంత్రం మూడు గంటల్లోగా పరిశీలన చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఐటీఐలలో అడ్మిషన్లకు కౌన్సెలింగ్ ఈ నెల 28న, ప్రైవేటు ఐటీఐలలో 30న జరుగుతాయన్నారు. వివరాలకు ప్రభుత్వ ఐటీఐ కార్యాలయ ఫోన్ నెంబరు 08812-230269లో సంప్రదించాలని కోరారు.



వసతి గృహానికి ఆర్వో ప్లాంట్

నూజివీడు, సెప్టెంబరు 17: ఎమ్మీ జూనియర్ కళాశాల బాలికల వసతి గృహానికి రాష్ట్ర పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి విద్యార్థుల కోసం ఆర్వో యూనిట్‌ను ఏర్పాటు చేయించారు. ఇటీవల వరదలతో వసతి గృహం గోడ కూలిపోగా మంత్రి సందర్శించారు. ఈ నేపథ్యంలో విద్యార్థినులు సమస్యను మంత్రి దృష్టికి తేవడంతో యుద్ధప్రాతిపదికన గోడ నిర్మాణం, ఆర్వో యూనిట్‌ను ఏర్పాటుకు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం వసతి గృహంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను కళాశాల అధ్యాపకులు, వసతి గృహం అధికారులు ప్రారంభించి విద్యార్థినులకు తాగు నీరందించారు.



ఏలూరులో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగస్వాములమవుదాం అంటూ ప్రమాణం చేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే చంటి, మేయర్ నూర్జహాన్ తదితరులు



భీమవరంలో రోడ్లు ఊడుస్తున్న కేంద్ర మంత్రి వర్మ, ఎమ్మెల్యే రఘురామ, కలెక్టర్ నాగరాణి

స్వచ్ఛతా హీ సేవాలో ప్రజలు భాగస్వాములు కావాలి

- జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి పిలుపు

ఏలూరు టూ టౌన్, సెప్టెంబరు 17 : స్వభావ స్వచ్ఛత - సంస్కార స్వచ్ఛతలో ప్రజలు భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల ప్రారంభోత్సవ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏలూరు పాతబస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో పరిశుభ్రత కార్యక్రమాల్లో సమష్టి కార్యాచరణ, పౌరులు భాగస్వామ్య స్ఫూర్తిని పునరుద్ధరించేందుకు ప్రజలు ముందడుగు వేయాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతపై సామాజిక స్పృహ కలిగి ఉండాలన్నారు. పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాల ద్వారా అధికారులు ప్రజలకు తెలియజేయాలన్నారు. జిల్లాలో అన్ని గ్రామాలు మున్సిపాలిటీలు, ప్రభుత్వ కార్యాలయాలు, హాస్టల్స్, పాఠశాలలు, కళాశాలలను స్వచ్ఛంగా తీర్చిదిద్దాలన్నారు. ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, పర్యావరణాన్ని కాపాడేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమష్టి జీవన విధానంగా మార్చుకునేలా సమష్టిగా ముందడుగు వేయాల్సిన అవసరం ఉందన్నారు. మేయర్ షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ నగరంలోని 50 డివిజన్లలో మంగళవారం నుంచి అక్టోబరు రెండో తేదీ వరకు 15 రోజులపాటు స్వచ్ఛభారత్ దివస్‌గా పాటిస్తు న్నామని అన్నారు. అనంతరం కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే చంటి, మేయర్ నూర్జహాన్, కమిషనర్ భానుప్రతాప్, వివిధ శాఖాధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులతో కలిసి మానవహారం నిర్వహించారు. పారిశుధ్య సిబ్బందితో కలిసి చీపుర్లు పట్టుకుని రోడ్లను శుభ్రం చేశారు. జడ్పీ సీఈవో సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, పశుసంవర్ధక శాఖ జేడీ నెహ్రూబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణ, మైనారిటీ సంక్షేమం ఏడీ కృపావరం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కొల్లేరును పరిరక్షించాలి

- ఆక్రమణలను తొలగించి.. ముంపు నివారణ చర్యలు చేపట్టాలి
- సీపీఐ జాతీయ, రాష్ట్ర కార్యదర్శులు నారాయణ, రామకృష్ణ



మండవల్లి మండలంలో చిన్న ఎడ్లగాడి వద్ద కొల్లేరు వరదను పరిశీలిస్తున్న సీపీఐ నేతలు నారాయణ, రామకృష్ణ

కైకలూరు, సెప్టెంబరు 17: ప్రపంచస్థాయిలో పేరు ప్రఖ్యాతలు వున్న కొల్లేరు సరస్సును కాపాడుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి కె.నారాయణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. మంగళవారం మండవల్లి మండలం పెద్ద, చిన్నఎడ్లగాడి వద్ద కొల్లేరు వరద ముంపును పార్టీ నేతలు, అధికారులతో కలిసి పరిశీలించారు. నారాయణ మాట్లాడుతూ కొల్లేరు సరస్సులో చేపల చెరువులను అక్రమంగా తవ్వడంతో కాలుష్య కోరల్లో చిక్కుకుని, వరద నీటి ప్రవాహానికి అవరోధంగా మారిందని అన్నారు. బుడమేరు, కొల్లేరు, ఉప్పుటేరుల్లోని ఆక్రమణల ప్రక్షాళన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనన్నారు. 2006లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కొల్లేరు ఆపరేషన్ చేసి కొద్ది మేర ఆక్రమణలను తొలగించిందని, కాని మళ్లీ అభయారణ్యం ఆక్రమణకు గురైందన్నారు. బుడమేరు, రామిలేరు, తమ్మిలేరు, చంద్రయ్య డ్రెయిన్, ఎర్ర కాలువ వంటి 64 డ్రెయిన్ల ద్వారా లక్ష క్యూసెక్కుల వరద నీరు కొల్లేరులోకి చేరుతోందన్నారు. ఈ నీరంతా ఉప్పుటేరు ద్వారా సముద్రంలోకి వెళుతుందన్నారు. కొల్లేరు ప్రక్షాళన చేస్తే ప్రభుత్వానికి సీపీఐ మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. రామకృష్ణ మాట్లాడుతూ కొల్లేరు ప్రక్షాళన చేయడంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటించాలని, ఇందుకు సీపీఐ పోరాటం చేస్తుందన్నారు. ప్రకృతి విపత్తుల వల్ల ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తాజాగా సంభవించిన వరదలతో ఏలూరు, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలు పూర్తిస్థాయిలో అతలాకుతలం అయ్యాయన్నారు. బుడమేరు ఆక్రమణల వల్ల విజయవాడ నష్టపోయిందన్నారు. జీవో నెంబరు 120 ప్రకారం 77,136 ఎకరాల్లో కొల్లేరు విస్తరించి వుందని దీనిని కాపాడాలన్నారు. కొల్లేరులో ఆక్రమణలు తొలగించి, చేపలు, రొయ్యల సాగును అరికట్టాలని డిమాండ్ చేశారు. సీపీఐ సహాయ కార్యదర్శి ఉప్పాల నాగేశ్వరరావు, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, రైతు సంఘ నాయకులు, డ్రైనేజీ అధికారులు, తదితరులు ఈ ముంపు పర్యటనలో పాల్గొన్నారు.

జల దిగ్బంధంలోనే కొల్లేరు రహదారులు



పెనుమాకలంక సమీపంలో జీవనోపాధి కోసం వెళుతున్న కూలీలు

కైకలూరు/మండవల్లి, సెప్టెంబరు 17 : పదో రోజు కూడా కొల్లేరు వరద నీటిలోనే ప్రజలు జీవనం సాగిస్తున్నారు. మండవల్లి మండలం పెనుమాకలంకకు పడవల్లోనే ప్రయాణాలు సాగుతున్నాయి. గ్రామాల నుంచి బయటకు రాలేక రోజు వారీ జీవనోపాధి కోసం చేపల వేటకు వెళ్లే కూలీలు ముంపు గ్రామాల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొన్నాయి. జీవనోపాధి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెనుమాకలంక, నందిగామలంక, ఇంగిలిపాకలంక, కొవ్వాడలంక, చింతపాడు గ్రామాల నుంచి రోజూ వందల సంఖ్యలో చేపల పట్టుబడులకు కూలీలు తరలివెళుతుంటారు. రాకపోకలు లేక వీరంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కైకలూరు మండలంలో పెంచికలమర్రు నుంచి కొల్లేటికోటకు వెళ్లే రహదారి ఇంకా నీటిలోనే ఉండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులను ప్రజలు ఎదుర్కొంటున్నారు. కొల్లేరు క్రమేపీ తగ్గుముఖం పడడంతో గ్రామాలు తేరుకున్నాయి. మరో నాలుగు రోజుల పాటు రహదారులపై ముంపు పోదని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు.

ముగిసిన పవిత్రోత్సవాలు



తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

పాలకొల్లుఅర్బన్, సెప్టెంబరు 17: శ్రీ అష్ట భుజ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో పవి త్రోత్స వాలు ఐదో రోజు మంగళవారం స్వామి, అమ్మ వార్లను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. ఆళ్వార్లకు అలంకార తిరుమంజ నోత్సవం నిర్వహించి, శాంతి కల్యాణం జరిపించారు. సాయం త్రం రథోత్సవంతో శ్రీవారి పవిత్రోత్సవాలు ముగిశాయి. ప్రధానార్చకుడు కరివెంకట శ్రీనివాసాచార్యులు, అర్చకులు పవన్ కుమారాచార్యులు, పూలపల్లి కృష్ణమాచార్యులు, రంగనాధాచార్యులు, పండితులు ప్రత్యేక వేద పఠనం గావించారు. భక్తులకు ప్రసాద వినియోగంగావించారు. పాలక కార్యనిర్వహణాధికారి బీవీవీఎస్ శంకర్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కొబ్బరి ఉత్పత్తులకు డిమాండ్



జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణను ప్రారంభిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 17: కొబ్బరి ద్వారా అనేక ఉప ఉత్పత్తుల తయారీపై యువతకు శిక్షణ ఇస్తే ఆర్థికంగా బలోపేతం అవుతారని ఉద్యాన శాఖ అడిషనల్ డైరెక్టర్ ఎం.వెంకటే శ్వర్లు అన్నారు. తాడేపల్లిగూ డెం మండలం వెంకట్రా మన్నగూడెం డాక్టర్ వైఎస్ ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం లో కొబ్బరి అభివృద్ధి బోర్డు, డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం, కేవీకే సంయుక్త ఆధ్వర్యంలో కొబ్బరి ఉత్పత్తుల తయారీ, విలువ జోడింపు (ట్రైనర్ ట్రైనీ)పై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. రాష్ట్రం లోని కృషి విజ్ఞాన కేంద్రంలో పని చేస్తున్న గృహ విజ్ఞానం, ఉద్యాన శాస్త్రవేత్తలకు ఈ శిక్షణ ఇచ్చారు. విశ్వవిద్యాలయ పరిశోధనా సంచాలకులు ఎం.మాధవి, విస్తరణా సంచాలకలు బి.గోవింద రాజులు, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త ఇ.కరుణశ్రీ, కొబ్బరి అభివృద్ధి బోర్డు డిప్యూటీ డైరెక్టర్ ఎస్.కుమార్‌వేల్ మాట్లాడారు.

పర్యాటక అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం టౌన్, సెప్టెంబరు 17 : ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకొని 2023-24 గాను ప్రకటించిన వివిధ అవార్డులకు అర్హులైన పర్యాటక సంబంధిత రంగాల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి కేఎస్ ప్రభాకర రావు తెలిపారు. ప్రతి ఏటా మాదిరిగానే మొత్తం 38 విభాగాల నుంచి 41 పర్యాటక సంబంధిత రంగాల అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. దరఖాస్తులను ఏపీ టూరిజం వెబ్ సైట్స్ నుంచి డౌన్లోడ్ చేసుకోవాలని, పూర్తి చేసిన వాటిని ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారి టీ, 5వ ఫ్లోర్, స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, ఆటోనగర్, విజయవాడలో ఈ నెల 22 తేదీ లోపు అందజేయాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్‌నెంబరు 63099 42024లో సంప్రదించాలని సూచించారు.

21న క్రికెట్ జట్టు ఎంపిక

ఏలూరు రూరల్, సెప్టెంబరు 17: పశ్చిమగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21న ఏలూరులోని ఆశ్రమం మెడికల్ కాలేజీలో అండర్ -14, బాలుర క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏజీ ఆదిత్యవర్మ మంగళవానం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు వ్యక్తిగత కిట్, బాల్స్‌తో ఉదయం తొమ్మిది గంటల కల్లా హాజరుకావా లన్నారు. క్రీడాకారులు 2010, సెప్టెంబరు ఒకటో తేదీ తరువాత జన్మించి ఉండా లన్నారు. జనన ధ్రువీకరణ పత్రం, బోన్‌ఫైడ్ సర్టిఫికెట్, ఆధార్ కార్డుతో హాజరు కావాలని కార్యదర్శి వీవీఎస్ఎన్ శ్రీనివాసరాజు తెలిపారు.

24న అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికలు

ఏలూరు రూరల్, సెప్టెంబరు 17: ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియం లో ఈ నెల 24న ఏలూరు డిస్ట్రిక్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి దేవరపల్లి ప్రసాద్ మంగళవా రం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ నాలుగు నుంచి ఆరో తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనేందుకు గాను ఈ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వయస్సు గల వారికి, అండర్-23 విభాగంలో బాల బాలికలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆధార్ కార్డు, పుట్టిన తేదీ ధ్రువపత్రం లేదా 10వ తరగతి మార్కులిస్ట్ తప్పని సరిగా తీసుకురావాలన్నారు. మరింత సమాచారానికి 62814 31202 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి హేక్తాన్ వేదికగా నిలవాలి

భీమవరం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 17 : సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కార సాధనకు హేక్తాన్ ఒక వేదికగా నిలవాలని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు అన్నారు. కళాశాల టెక్నా లజీ సెంటర్ ఆధ్వర్యంలో 12 గంటలపాటు జరిగే హేక్తాన్ కార్యక్రమం టెక్నాలజీ సెంటర్ హెడ్ డాక్టర్ ఎన్.గోపాలకృష్ణమూర్తి అధ్యక్షతన మంగళవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 2017లో ప్రధాని మోదీ యువ మేధావు లను ప్రోత్సహించేందుకు ప్రారంభించిన స్మార్ట్ ఇండియా హేక్తాన్ కార్యక్రమంలో తమ కళాశాల విద్యార్థులు ఇప్పటికే జాతీయ స్థాయిలో రెండుసార్లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో జాతీయ స్థాయి లో జరిగే పోటీలలో తమ విద్యార్థులు ప్రతిభ చాటాలని కోరారు. కళాశాల ప్రిన్సి పాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు, డాక్టర్ ఎన్.గోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ అన్ని ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన వంద టీమ్‌లు పంపుతున్నామన్నారు.

న్యాయవాది మృతిపై కేసు నమోదు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 17: నగరానికి చెందిన ఓ న్యాయవాది మృతి కేసులో ఆయన భార్య, ఆమె తరపు కుటుంబ సభ్యులపై టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్ఆర్ పేటకు చెందిన నాయ్యవాది పయనం కార్తీక్ హైదరాబాద్‌లో ఉన్న సమయంలో మనీషా ప్రియా యాదవ్‌ను 2017లో ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆ తరువాత ఏలూరులో కొంత కాలం కాపురం చేశారు. కార్తీక్ ఎస్సీ, భార్య మనీషా ప్రియాయాదవ్ బీసీ సామాజిక వర్గాలకు చెందిన వారు. కాలక్రమంలో భార్య తరఫు కుటుంబ సభ్యులు కుల వివక్ష చూపేవారు. 2023 ఏప్రిల్‌లో మనీషా భర్త కార్తీక్ యాదవ్‌ను వదిలి వెళ్లిపోయారు. ఆ తరువాత ఆమె తన కుటుంబ సభ్యులతో ఉంటూ కార్తీక్‌పై కేసులు పెట్టారు. దీంతో మనోవ్యధకు గురైన కార్తీక్ తీవ్ర అనారోగ్యానికి గురై ఈ ఏడాది ఆగస్టులో విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తన కుమారుడి మృతికి అతని భార్య, ఆమె తరపు కుటుంబసభ్యుల వేధింపులే కారణమని మృతుడి తండ్రి రత్నరాజు ఏలూరు టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కార్తీక్ భార్య మనీషా, ఆమె కుటుంబ సభ్యులైన మాధవీ యాదవ్, స్వప్న ప్రియాయాదవ్, మారబోయిన శ్రావణ్‌కుమార్ యాదవ్, గెల్లబోయిన శ్రావణ్‌కుమార్ యాదవ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హెచ్ఎంపై సమగ్ర విచారణకు చర్యలు

ముదినేపల్లి, సెప్టెంబరు 17 : ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం పెదపాలపర్రు జడ్పీ హైస్కూల్‌లో అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై సస్పెండై ప్రస్తుతం ఇంగిలిపాకలంక హైస్కూల్ హెచ్ఎం శాంతకుమారిపై సమగ్ర దర్యాప్తు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్‌ను టీడీపీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌరి, హైస్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ నరసింహ మూర్తి, మాజీ చైర్మన్ వెంకటేశ్వరరావు కోరారు. మంగళవారం వారు ఎమ్మెల్యేని కలసి హెచ్ఎంపై ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ నెల 19న విచారణ జరుగుతున్నందున అన్ని అంశాలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని కోరారు. దీనిపై తాను కలెక్టర్, డీఈవోతో మాట్లాడి విచారణ సమగ్రంగా జరిగేలా చర్యలు తీసుకుంటానన్నారు.

ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి

కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ



భీమవరం అంబేడ్కర్ సెంటర్ వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

భీమవరం టౌన్, సెప్టెంబరు 17 : ప్రజల భాగస్వామ్యం లేనిదే ఏ ఒక్క కార్య క్రమం విజయవంతం కాదని, నేటి నుంచి చేపట్టిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమ లక్ష్యాలను నెరవేర్చాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ అన్నారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద మంగళ వారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా ప్రారంభ కార్యక్రమానికి ఆయన ము ఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొ ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛతా హీ సేవా పేరిట కార్యక్రమాలను నిర్వహిం చడం జరుగుతుందన్నారు. చెత్త వాహనాల ద్వారా తడి, పొడి చెత్త సేకరణ జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడం మానడం కోసమే స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమా లను చేపట్టడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజి బాబు) మాట్లాడుతూ రోడ్లపై చెత్త వేయకుండా మునిసిపల్ వాహనాలకు మాత్రమే అందించాలని సూచించారు. ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామ కృష్ణరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన మరుగుదొడ్ల కార్యక్రమం తల మానికంగా నిలిచిందన్నారు. తొలుత వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యా ర్థులతో ఏర్పాటు చేసిన మానవహారంలో పాల్గొని, ప్రతిజ్ఞ చేశారు. అనంతరం అంబేడ్కర్ సర్కిల్ వద్ద రైల్వే అండర్ పాస్ పక్క రోడ్డులో చీపుర్లు చేతబట్టి చెత్త ను శుభ్రం చేసి, డస్ట్ బిన్స్‌లో వేశారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయిం అస్మి, జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి, ఏఎస్పీ వి.భీమారావు, డీఎస్పీ జయసూర్య, మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రరెడ్డి, జిల్లా గ్రామ వార్డు సచివాలయ అధికారి డాక్టర్ కేసీహెచ్ అప్పారావు, జిల్లా ఆర్‌బ్ల్యూఎస్ అధికారి బి.నాగేశ్వరరావు, తహసీల్దార్ ఆర్.రాంబాబు, శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, ఏఎంసీ మాజీ చైర్మన్ కోళ్ల.నాగేశ్వరరావు, మెంటే పార్థసారథి, వేగేశన్న కృష్ణంరాజు, మెప్మా ఆర్పీలు, డీఎన్ఆర్ కాలేజ్ ఎన్‌సీసీ విద్యార్థులు కేజీఆర్ఎల్ కళాశాల, డాక్టర్ సీఎస్ఎన్ కళాశాల, పీఎంఎస్ బాలికలు స్కూలు, జేఎల్‌బీ బాలికల స్కూలు విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారిణి జ్యోతిక, మాజీ సైనికులకు సత్కారం

మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా యువ మోర్చా అధ్యక్షుడు కలిదిండి వినోద్ కుమార్ వర్మ ఆధ్వర్యంలో భీమవరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో మంత్రి వర్మ చేతుల మీదుగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో 4×400 మీటర్స్ రన్నింగ్‌లో పాల్గొన్న తణుకునకు చెందిన దండి జ్యోతికను సన్మానించి రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే ఇద్దరు మాజీ సైనికులకు సత్కరించారు. మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్, ఫోటో ఎగ్జిబిషన్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు నార్ని తాతాజీ, కాయిత సురేంద్ర, అరస వల్లి సుబ్రహ్మణ్యం, కోమటి రవి కుమార్, ఆడబాల శివ, మొహిద్దీన్ రాజు, గోవర్ధన్, అడ్డగర్ల ప్రభాకర్ గాంధీ, అయినంపూడి శ్రీదేవి, లంక లక్ష్మీ, రమాదేవి, వబిలిశెట్టి ప్రసాద్, అరసవల్లి మణికంఠ పాల్గొన్నారు.

బంగారం ధరలకు మళ్లీ రెక్కలు

- తగ్గినట్టే తగ్గి.. మళ్లీ పైపైకి
- 24 క్యారెట్లు గ్రాము రూ.7,500
- 22 క్యారెట్లు రూ.6,900



నరసాపురం, సెప్టెంబరు 17: పసిడి ధర తగ్గినట్టె తగ్గి.. మళ్లీ దూసుకుపోతోంది. మంగళ వారం గ్రాము బిస్కెట్ బంగారం రూ.7,500 ఉండగా... అర్నమెంట్ బంగారం రూ.6,900లకు చేరింది. గడిచిన 15 రోజుల నుంచి పసిడి ధర క్రమంగా పెరుగుతూ వస్తుంది. దీంతో మళ్లీ ఆల్‌టైం రికార్డు ధరను క్రాస్ చేస్తుందా? అన్న ఊహాగానాలు బులియన్ మార్కెట్‌లో షికారు చేస్తున్నాయి. కేంద్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బంగారం ధరల్ని తగ్గించాలని కస్టమ్ డ్యూటీని 9 శాతం తగ్గిం చింది. దీంతో ధరలు ఒక్కసారిగా దిగిపోయాయి. కేంద్ర బడ్జెట్ తరువాత గ్రాము బిస్కెట్ బంగారం రూ.6,900కు దిగిరాగా... ఆర్నమెంట్ బంగారం ఒక్కసారిగా రూ.6,350కి పడిపోయింది. దీంతో వినియోగదారులు ధరలు ఇంకా తగ్గుతాయని అంచన వేశారు. దానికి తగ్గట్టుగానే కొన్ని రోజులు నిలకడగా కొనసాగింది. అయితే అంతర్జాతీయంగా నెలకొన్ని పరిస్థితులతో మళ్లీ పసిడి ధర పరుగులు తీస్తోంది. గడిచిన వారం రోజుల నుంచి క్రమం గా పెరు గుతూ వస్తుంది. దీంతో బులియన్ మార్కెట్‌కు పేరొందిన నరసాపురం మార్కెట్‌లో అమ్మకాలు గణనీయంగా తగ్గాయి. ఒక్కసారిగా తగ్గి నెల రోజుల్లోనే మళ్లీ బంగారం పెరుగుతుం డటంతో చాల మంది కొనేందుకు వెనుకంజ వేస్తున్నారు.

వసతి గృహ బాలికలపై

లైంగిక వేధింపులు

- మేట్రిన్ భర్త ఘాతుకం
- బయట ప్రాంతాలకు తీసుకువెళ్లి లైంగిక దాడులు
- వెలుగులోకి వచ్చిన పలు సంఘటనలు
- పోలీసులకు ఫిర్యాదు..
- కేసు నమోదు
- పరారీలో మేట్రిన్ ఆమె భర్త



శశికుమార్

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 17 : నగరంలో ఉన్న ఒక బాలికల వసతి గృహంలో చదువుతున్న బాలి కలపై ఆ వసతి గృహ మేట్రిన్ భర్త అసభ్యంగా ప్రవర్తించి అత్యాచారానికి పాల్పడ్డాడనే అభియో గంపై ఫిర్యాదు అందడంతో పోలీసులు రంగంలోకి దిగారు. కేసు నమోదు చేసిన పోలీసులు పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చేపట్టారు. బాధి తులు, వారి తల్లిదండ్రులు తెలిపిన వివరాలు ప్రకారం.. పేద పిల్లలు, అనాథ పిల్లలకు విద్యను అందించాలనే ఆశయంతో అమెరికాలో ఉన్న గురు కృప ఫౌండేషన్ ఏలూరుకు చెందిన ఒక స్వామీజీ పర్యవేక్షణలో అమీనాపేటలో రెండేళ్ల క్రితం బాలి కల వసతి గృహాన్ని ఏర్పాటు చేశారు. ఆ వసతి గృహం మేట్రిన్‌గా ఫణిశ్రీ అనే ఆమెను నియమిం చగా ఆమెకు భర్తగా ఉన్న బి.శశికుమార్ తరచుగా అక్కడకు వచ్చి స్వామీజీతో మాట్లాడుతూ తన మేనకోడలు లావణ్యకు కేర్ టేకర్ అవకాశం ఇవ్వాలని కోరడంతో ఆమెను నియమించారు. ఆ తరువాత ఆ స్వామీజీ మరణించడంతో ఆ సంస్థ వీరి చేతులోకి వెళ్లిపోయింది. శశికుమార్ తరుచుగా వస్తూ పిల్లలకు ఫొటోషాప్ నేర్పిసా నంటూ తనకు ఉన్న స్టూడియో వద్దకు తీసుకు వెళ్లేవాడు. ఈ విధంగా పిల్లలను తన మాయ మాటలతో సెలవు వచ్చిన రోజు ఫొటోషూట్ అం టూ వేరే ప్రాంతానికి తీసుకువెళ్లి వారిపై అసభ్యం గా ప్రవర్తించే వాడని చెబుతున్నారు. ఒక బాలిక ను ఈ నెల 15న బాపట్ల తీసుకువెళ్లి 16వ తేదీ సాయంత్రం తీసుకువచ్చాడు. వచ్చినప్పటి నుంచి ఆ బాలిక నీరసంగా ఉండడంతో తోటి బాలికలకు అనుమానం వచ్చి ఆరా తీశారు. దీంతో జరిగిన విషయం చెప్పడంతో అందరూ అవాక్కయ్యారు. ఈ విషయం బయటకు వచ్చిందని గ్రహించిన శశి కుమార్ అతని రెండో భార్య ఫణిశ్రీ ఈ నెల 15వ తేదీ రాత్రి 11 గంటల ప్రాంతంలో పిల్లలను మోకాళ్ల వేయించి కర్రతో చితకబాదారని, అంతేకా కుండా చేతులతో చెంపలపై కొట్టారని చుట్టు పక్కల ఉన్న ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. మొత్తం మీద ఈ విషయం బయటకు వస్తుందని భావించిన భార్యభర్తలు తెల్లవారేటప్పటికి పరార య్యారు. ఇదే విషయం వారు చదువుతున్న స్కూల్లోని ఉపాధ్యాయులకు తెలియజేయడంతో తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వారు మంగళవారం సాయంత్రానికి చేరుకున్నారు. పిల్ల లు, తల్లిదండ్రులు కలిసి టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. దీంతో ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో టూ టౌన్ సీఐ వైవీ రమణ, భీమడోలు సీఐ యూజే విల్సన్, నిడమర్రు సీఐ ఎంవీ సుభాష్ వారి సిబ్బందితో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నిందితులను అరెస్టు చేయడానికి రంగంలోకి దించారు.

మరోవైపు మహిళా పోలీసులు, మహిళా ఎస్ఐ లు బాధితుల నుంచి వాగ్మూలాలను నమోదు చేస్తున్నారు. ఇంకోవైపు జిల్లా బాలల సంరక్షణ అధికారిణి సూర్యచక్రవేణి ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ మంగళవారం రాత్రి సంఘటనా స్థలం వద్ద మాట్లాడుతూ విద్యా ర్థినులతో అతను అసభ్యంగా ప్రవర్తించినట్లు తనకు మూడు ఫిర్యాదులు అందాయని వాస్తవాల ను పూర్తిగా తెలుసుకునేందుకు మహిళా ఎస్ఐ లతో విద్యార్థుల నుంచి వాగ్మూలాలను నమోదు చేయిస్తున్నామన్నారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి నిందితులపై చర్యలు తీసుకుంటామన్నారు.

వీడు మామూలోడు కాదు

గతంలో వివిధ కార్పొరేషన్‌లో స్కిల్ డెవలప్ మెంట్ ప్రోగ్రామ్ కింద యువతకు ఫొటోగ్రఫీ నేర్పించారు. శశికుమార్ తనకు ఉన్న సత్రంపాడు స్టూడియో ద్వారా యువతీ యువకులకు ఫొటో గ్రఫీ నేర్పిస్తూ ఆయా కార్పొరేషన్ల నుంచి సొమ్ము లను తీసుకునేవాడు. అప్పట్లోనే అతనిపై ఎన్నో అభియోగాలు వచ్చాయి. చివరకు ఆ పథకాలన్ని రద్దయ్యాయి. తన స్టూడియోకి ఫొటోల కోసం వచ్చే వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులను తెలుసు కుని వారిని వలలో వేసుకుని ఫొటోగ్రఫీ నేర్పిస్తానంటూ మోసాలకు పాల్పడుతున్నాడని అభియోగాన్నాయి.

అనుమతులేవి?

ఏలూరు అమీనాపేటలో ఉన్న ఈ వసతి గృహానికి అనుమతులు ఎవరు ఇచ్చారనేది అయోమయంగా కనిపిస్తోంది. అక్కడ జరిగిన సంఘటనలు బయటకు రావడంతో పోలీస్ శాఖ, శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ అధికారులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. సంస్థలు నిర్వహించాలంటే ఖచ్చితంగా రిజిస్టర్ అయి ఉండాలి. అంతేకాకుండా శిశు సంక్షేమ శాఖ అనుమతులు ఉండాలి. పోలీస్ శాఖకు కూడా తెలియజేయాలి. విద్యా శాఖకు వివరాలు ఇవ్వాలి. కానీ ఇవి ఏమి లేనట్లుగానే తెలుస్తోంది.

విద్యార్థులు ఎలా చేరారంటే..

ప్రభుత్వ ఎస్సీ, బీసీ హాస్టల్స్‌లో సీట్ల కోసం వెళ్లిన విద్యార్థినులకు అక్కడ సీట్లు ఖాళీ లేవని అక్కడ ఉన్న వారు చెబుతూ ఉచితంగా ఈ వసతి గృహంలో సీటు ఇస్తారంటూ చెప్పడంతో చివరకు ఆ విధంగా చేర్పించామంటూ అక్కడ కొంత మంది తల్లిదండ్రులు చెప్పుకొచ్చారు. అక్కడ చక్కగానే చూస్తారంటూ కితాబు పలికారని అందుకే అక్కడ చేర్పించామని చెబుతున్నారు. ఒక విద్యార్థిని చేరడం ద్వారా మరో విద్యార్థిని చేరారని, ప్రస్తుతం రెండో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ 50 మంది విద్యార్థినులు ఉన్నట్లు చెబుతున్నారు.

సొంతింటి కల సాకారం



ప్రధాని ప్రసంగాన్ని భీమవరం కలెక్టరేట్ నుంచి తిలకిస్తున్న కేంద్ర మంత్రి వర్మ, కలెక్టర్ నాగరాణి

భీమవరం టౌన్, సెప్టెంబరు 17 : పేదల సొంతింటి కలను సాకా రం చేసేందుకు, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 పథకాన్ని ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం ప్రారంభించారు. పట్టణ ప్రాం త పేదల కోసం పీఎంఏవై అర్బన్, గ్రామీణ ప్రాంతాల కోసం పీఎం ఏవై గ్రామీణ్ పథకాలను ప్రవేశపెట్టారు. ఒడిషా రాష్ట్రంలో వేడుకగా జరిగిన ఈ కార్యక్రమాన్ని జిల్లాలో ప్రత్యక్ష ప్రసారం చేశారు. పీఎంఏవై ప్రారంభ కార్యక్రమాన్ని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయం మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్‌వో జె.ఉదయ భాస్కరరావు తిలకించారు. వీరితోపాటుగా హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ పిచ్చయ్య, మెప్మా, జిల్లా బీజేపీ అధ్యక్షుడు నార్ని తాతాజీ, నాయకు లు కోమటి రవికు మార్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నా రు. ప్రధాని ఆవాస యోజన పథకంలో విస్సాకోడేరులే-అవుట్‌లో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న వాటిని మంత్రి వర్మ ప్రారంభించారు. లబ్ధిదారులకు ఇళ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆర్టీసీ డిపో వెనుక వైపు బైపాస్ రోడ్డును మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, కలెక్టర్ నాగరాణి, మునిసిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డితో కలసి పరిశీలిం చారు.

లబ్ధిదారులకు

ఇంటి తాళాలు అందజేత



లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు అందజేత కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు సిటీ, సెప్టెంబరు 17: ఇళ్లు లేని నిరుపేదలకు ఇల్లు నిర్మించుకోవటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవకాశం కల్పిస్తు న్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఒడిషా రాష్ట్రంలోని భువనేశ్వర్ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 పథకాన్ని ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం ప్రారంభించారు. ఈ ప్రారంభ కార్యక్రమాన్ని స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ప్రత్యక్ష ప్రసారం ద్వారా కలెక్టర్ వెట్రిసెల్వి, జిల్లాలోని గృహ నిర్మాణ శాఖాధికారులు, లబ్ధిదారులు వీక్షించారు. అనంతరం కలెక్టర్ చేతు మీదుగా (2023-24) సంవత్సరానికి ఆరు నెలల ముందు ఇళ్ల నిర్మా ణం పూర్తి చేసిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా లబ్ధిదారులైన ఏలూరు అర్బన్‌కు చెందిన పిల్లబోయిన అన సూయ, తాడి కుమారిలకు కలెక్టర్ ఇంటి తాళాలు అందజేశారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ అర్హులు ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ ఎ.శ్రీనివాస రావు, టిడ్కో ఈఈ స్వామినాయుడు, హౌసింగ్ డీఈ జి.రామకృష్ణ, హౌసింగ్ మేనేజర్ ఎండీ షరీఫ్, జిల్లాలోని హౌసింగ్ ఈఈలు, డీఈలు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

ఏచూరి జీవితం ఆదర్శనీయం




సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మోషేన్‌రాజు, తదితరులు

భీమవరం అర్బన్, సెప్టెంబరు 17 : దేశంలో ప్రతిష్ఠాత్మకమైన జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీకి మూడు సార్లు విద్యార్థి సంఘ అధ్యక్షుడిగా ఎన్నికైన ఘనత సీతారాం ఏచూరికి ఉందని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. సీతారాం ఏచూరి సంస్మరణ సభను భీమవరం చాంబర్ ఆఫ్ కామర్స్ హాలులో సీపీ ఎం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. తొలుత ఏచూరి చిత్ర పటానికి మోషేన్‌రాజు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతె న సీతారాం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సభకు సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అధ్యక్షత వహించి మాట్లాడుతూ రాష్ట్ర విభజనలో చివరి వరకు పార్లమెంట్‌లో సమైక్యాంధ్ర కోసం పోరాడిన ధీరుడు ఏచూరి అన్నారు. మంతెన సీతారాం మాట్లాడు తూ దేశంలోనే అగ్రనాయకునిగా ఎదిగారన్నారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ మహాపోరాట యోధుడు సీతారాం ఏచూరి అన్నారు. టీడీపీ రాష్ట్ర నాయకులు మెంటే పార్థసారథి, జన సేన ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ ఏచూరి మృతి దేశంలో వామపక్ష ఉద్యమానికి తీరని లోటన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, పి.హరికుమార్‌రాజు, ఫార్వర్డ్ బ్లాకు జిల్లా కార్యదర్శి లంకా కృష్ణమూర్తి, సీపీఎం సీనియర్ నాయకులు జుత్తి నరసింహ మూర్తి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జేఎన్‌వీ గోపాలన్, డి.కళ్యాణి, బి.వాసుదేవరావు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వసంతవాడలో మహిళ దారుణ హత్య




సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పెదవేగి సీఐ వెంకటేశ్వరరావు

పెదపాడు, సెప్టెం బరు 17 : పెదపాడు మండలం వసంతవాడలో ఒంటరిగా నివాస ముంటున్న మహిళ దారుణ హత్యకు గురైంది. పెదపాడు పోలీసుల కథనం ప్రకా రం వసంతవాడ గ్రామానికి చెందిన గుజ్జుల అనిత (37) ఎస్సీ కాలనీలో సొంత ఇంట్లో ఒంటరిగా నివాస ముంటోంది. ఈమె అవివా హిత కాగా, కృష్ణా జిల్లా బాపులపాడు మండ లం, నారాయణపురానికి చెందిన మెండెం నవీన్‌కుమార్‌తో కొంత కాలంగా సహజీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో నవీన్‌కుమార్‌కు అనితకు మధ్య సోమవారం రాత్రి తగాదా జరగ్గా మద్యం మత్తులో అనితను బలంగా కొట్టడంతో తలకు గాయమై తీవ్ర రక్తస్రా వంతో మృతి చెందిందన్నారు. అనిత ప్రస్తుతం ఏడు నెలల గర్భిణి అనా పోలీసులు తెలిపారు. మంగళవారం ఉదయం మృతి చెందిన అనితను చూసిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇవ్వగా, పెదవేగి సీఐ కె.వెంకటేశ్వరరావు, పెదపాడు ఇంచార్జి ఎస్సై కె.స్వామి సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. మృతురాలి చెల్లి కిర్లంపూడి అరుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 17 : వేగంగా వెళ్తున్న జామాయిల బాదుల లోడు లారీ అదుపు తప్పి బ్రిడ్జి డివైడర్‌ను ఢీకొని బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేటకు చెందిన మాదాసు రంగ బాబు (47)కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. లారీ డ్రైవరైన రంగబాబు జామా యిల్ బాదుల లోడు వేసుకుని రాజమహేంద్రవరం వెళ్తుండగా మార్గ మధ్యలో ఏలూరు మెయిన్ బైపాస్, వంగూరు మెయిన్ బ్రిడ్జిపై లారీ అదుపు తప్పి బ్రిడ్జి డివైడర్‌ను ఢీ కొని బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో రంగబాబు అక్కడికక్కడే మరణించాడు. ఏలూరు త్రీ టౌన్ సీఐ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నలుగురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు



జువ్వలపాలెంలో ఏర్పాటు చేసిన పోలీస్ పికెట్

కాళ్ళ, సెప్టెంబరు 17 : మండ లంలోని జువ్వలపాలెంలో సోమ వారం రాత్రి గణేష్ నిమజ్జనం సందర్భంగా తలెత్తిన ఘటనకు సంబంధించి నలుగురు వ్యక్తు లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు కాళ్ళ ఎస్ఐ ఎస్.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. గ్రామంలో ఎటువంటి అవాంఛ నీయ సంఘటనలు జరగకుండా, శాంతియుత వాతావరణం ఉండే విధంగా ముందస్తుగా నాలుగు రోజుల పాటు పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా బయట వ్యక్తులు ఎవరైనా వచ్చి ప్రతికూల వాతావరణం సృష్టించే విధంగా ప్రయత్నం చేయకూడదని హెచ్చరించారు.

నిమజ్జనంలో యువకుడిపై దాడి

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 17 : వినాయక నిమజ్జన ఊరేగింపులో కొందరు యువకులు మరో యువకుడి పై దాడికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 16 రాత్రి రామకోటి వద్ద ఏర్పాటు చేసిన వినా యక నిమజ్జన ఊరేగింపు కన్నయ్య పార్కు వద్దకు వచ్చేసరికి ఆ ఊరేగింపు లో పాల్గొన్న తూర్పువీధికి చెందిన పి.రాజశేఖర్ అనే యువకుడిపై అదే ఊరేగింపులో పాల్గొన్న వాసు, ప్రవీణ్, విక్కీ అనే యువకులు ఘర్షణకు దిగా రు. ఊరేగింపు నుంచి బయటకు లాగేశారు. దీంతో రాజశేఖర్ అక్కడ నుంచి తన స్నేహితులతో కలిసి వెళ్లిపోగా రాజీ చేసుకుందాం రమ్మని మళ్లీ ఫోను చేసి కన్నయ్య పార్కు వద్దకు రప్పించారు. అక్కడ మళ్లీ తేజ, వాసు, విక్కీ, ప్రవీణ్, సాయి మరికొంత మంది కలిసి రాజశేఖర్‌ను కర్రలతో కొట్టారు. చంపేస్తామని బెదిరించారు. కింద పడిపోయిన బాధితుడిని 108లో సర్వజన ఆస్పత్రికి తరలించారు.

బాలికను వేధించిన యువకులు

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 17 : వినాయకుని నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్న ఓ బాలికను కొందరు యువకులు వేధించారు. పక్కనే ఉన్న బాలిక తమ్ముడు దీన్ని అడ్డుకోగా అతనిపై దాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక కొత్తపేట పెద్దింటివారి వీధిలో ఈ నెల 16 రాత్రి వినాయక నిమజ్జన ఊరేగింపు జరుగుతుంది. ఈ క్రమంలో అదే ప్రాంతానికి చెందిన ఇద్దరు అక్క చెల్లెళ్లేలు, వారి తమ్ముడు ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ క్రమంలో అదే ప్రాంతా నికి చెందిన అగ్గాల ధనుష్, రోహిత్ సాయి, త్రిశూల్, నీరజ్ అనే యువకులు ఈ అక్కాచెల్లెళ్లల్లో ఓ బాలికతో హేళనగా మాట్లాడు తూ ఆమె చేయి పట్టుకుని తాకుతూ వేధించారు. ఆ పక్కనే ఉన్న బాలిక తమ్ముడు వారిని అడ్డుకోగా ఆ యువకులు నీకెందుకు రా అంటూ అతనిపై దాడి చేశారు. దీంతో గాయాలపాలైన తమ్ముడిని ఏలూరు సర్వజన ఆస్పత్రి అత్యవసర విభాగానికి తీసుకురాగా వైద్యులు చికిత్స అందించారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తికి గాయాలు

టి.నరసాపురం, సెప్టెంబరు 17: రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొన్న ప్రమాదంలో వ్యక్తి గాయాలపాలైన సంఘటన మండలం లోని బొర్రంపాలెం మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెం మండలం టెక్కినవారి గూడెంకి చెందిన గొవ్వాడ నాగు బొర్రంపాలెంలో తన పని ముగించుకుని ద్విచక్రవాహనంపై స్వగ్రామం తిరిగి వెళుతుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ప్రమాదవశాత్తు ఢీ కొనడంతో నాగు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తరలించారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న ఆటో..

ఉంగుటూరు, సెప్టెంబరు 17 : ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును కూరగాయల లోడ్డుతో వెళ్తున ఆటో ఢీ కొనడంతో ఆటో డ్రైవర్ గాయాలపాలయ్యాడు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది కథనం ప్రకారం తణుకు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును జాతీయ రహదారిపై కైకరం ఆపగా, అదే సమయంలో వెనక కూరగాయల లోడుతో వస్తున్న ఆటో అదుపు తప్పి వెనుక నుంచి ఆర్టీసీ బస్సును ఢీకొంది. దీంతో ఆటో డ్రైవర్ తలకు తీవ్ర గాయమైంది. హైవే అంబులెన్స్‌లో ఆటో డ్రైవర్‌ను తాడేపలిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కలెక్టరేట్‌లో ఘనంగా విశ్వకర్మ జయంతి



విశ్వకర్మ చిత్రపటం వద్ద కలెక్టర్ నివాళి

ఏలూరు సిటీ, సెప్టెంబరు 17: విశ్వకర్మను ప్రపంచంలోనే మొట్టమొదటి వాస్తు శిల్పిగా భావిస్తారని కలెక్టర్ కె.వెట్రి సెల్వి అన్నారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా మంగళవారం కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ పి.ధాత్రిరెడ్డి విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ వ్యవస్థలో బంగారు, కమ్మరి, నేతన్నలు, తాపీ పనివారు, కుమ్మరి పనివార్లకు విశ్వకర్మ యోజన ద్వారా ప్రభుత్వం సాధికారిత కల్పించేందుకు కృషి చేస్తోందన్నారు. విశ్వబ్రాహ్మణ నాయకుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పొట్నూరి శివరాం, ఎలబాక కృష్ణ, కేళ్ళ దుర్గాప్రసాద్, కేవీ.బ్రహ్మం తదితరులు మాట్లాడుతూ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు స్కిల్ ట్రైనింగ్ సెంటర్లును ఏర్పాటు చేయాలని కోరారు. విశ్వకర్మ జయంతిని పబ్లిక్ హాలీడే ప్రకటించేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, ఆర్డీవో ఎన్ఎస్‌కె ఖాజావలి, బీసీ కార్పొ రేషన్ ఈడీ ఎస్.పుష్పలత, పలువురు అధికారులు పాల్గొన్నారు.

● కామవరపుకోట: మండలంలోని విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి మహోత్సవాన్ని నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటాలకు పూలాభిషేకం, అర్చనలు, కుంకుమార్చనలు, హోమాలు, పూజలు నిర్వహించారు.

● ఉంగుటూరు: విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఉంగుటూరులో విశ్వకర్మ చిత్రపటానికి, కైకరం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పూజలు చేశారు. ఉంగుటూరులో మండల అధ్యక్షులు అనుపోజు వీరబ్రహ్మం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నెల్లూరి వీర వెంకట సత్యనారాయణ, అరిపాక వెంకటేశ్వరరావు, నిడదవోలు శ్యాం, సభ్యులు పాల్గొన్నారు. కైకరంలో కామాక్షి విశ్వ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టారు.

● పోలవరం: ఎన్టీఆర్ కాలనీలో కార్పెంటర్ల సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి నిర్వహించారు. చేతివృత్తులకు ఆద్యుడు విశ్వకర్మ జయంతి సందర్భంగా కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. తుమరాడ పోశిబాబు, మండల కార్పెంటర్లు అధిక సంఖ్యలో పాల్గొని విశ్వకర్మకు పూజలు నిర్వహించారు.

● ఏలూరు రూరల్: స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు కాదులూరి తిలక్ తదితరులు విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేశారు. పొద్దూరి నాగభూషణం, రేపాక దుర్గాప్రసాద్, సాయికృష్ణ, వెంకట సత్యనారాయణ, లక్కోజు వెంకటేశ్వరరావు, ఎల్. సత్యనారాయణ, మరడాని శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, ఈశ్వర్‌రావు, మంతిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. వైఎంహెచ్‌ఏ ప్రాంగణంలో బ్రాహ్మణ సంక్షేమసంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బడేటి చంటి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సింహాద్రి బ్రుంగాచార్యులు, తుమ్మోజు రామలక్ష్మణచార్యులు, ఎ.శివకేశవరావు, రామలక్ష్మణచార్యులు, కె.కామేశ్వరరావు, కృష్ణ పాల్గొన్నారు.

● లింగపాలెం: విశ్వబ్రాహ్మణులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ధర్మాజీగూడెంలో విశ్వకర్మ యజ్ఞ మహోత్సవంలో పాల్గొన్నారు. విశ్వబ్రాహ్మణులకు పనిముట్లతో పాటు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తుందని సొంగా రోషన్‌కుమార్ అన్నారు. గారపాటి బుజ్జియ్య గరిమెళ్ళ చలపతిరావు, మోరంపూడి ప్రసాద్, విశ్వబ్రాహ్మణులు పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల: వృత్తులలో నైపుణ్యం కల్గిన వారికి విశ్వకర్మ యోజన ద్వారా ప్రభుత్వం అండగా ఉందని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. ఆళ్వార్ సదనంలో జరిగిన విశ్వకర్మ భగవానుని జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. లంకా సత్తిపండు, పోలిన శ్రీనివాసరావు, మొగతడకల శ్రీనివాసరావు, ఓం ప్రకాష్‌చౌదరి, కారుమంచి మురళి పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి : ఎమ్మెల్యే చంటి



చెక్కు అందిస్తున్న ఆటో యూనియన్ నేతలు

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 17: వరద బాధితులను ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. విజయవాడ ముంపు బాధితులకు ఏలూరు ఆటో యూనియన్ నాయకులు రూ.50వేలు విరాళాన్ని ప్రకటించారు. బడేటి క్యాంపు కార్యాలయంలో రూ.50వేలు చెక్కును ఎమ్మెల్యేకు యూనియన్ అధ్యక్షుడు లీలాకృష్ణ ఆధ్వర్యంలో అందజేశారు. వరద బాధితులకు విరాళాలు అందించిన ఆటో యూనియన్ నాయకులు ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, కే.బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: వరద బాధితులకు సాయం అందించేందుకు న్యూజనరేషన్ స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఆహారం, బియ్యం, నిత్యావసరాల సరుకులను అందజేశారు. నిత్యావసరాలు తరలిస్తున్న వాహనాన్ని కార్పొరేటర్ బీమవరపు హేమసుందరి ప్రారంభించారు. బేబి, డాక్టర్ గౌతమ్, కొనకళ్ళ రాజా, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల సహాయానికి రూ.2.86 లక్షలు

చింతలపూడి, సెప్టెంబరు 17: పట్టణంలో పలువురు వ్యాపారులు, కాపు సంక్షేమ నేతలు, వరద బాధితుల కోసం రూ.2,86,116 మొత్తాన్ని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌కు మంగళవారం అందజేశారు. కాపు సంక్షేమ సంఘం రూ.50,116, బులియన్ వ్యాపారులు రూ.50వేలు, రాఘవాపురం ముస్లింలు రూ.50వేలు, నూనె మిల్లుల వ్యాపారులు రూ.30వేలు, మోటారు, ఎలక్ట్రికల్ వ్యాపారులు రూ.40వేలు, హోటల్స్ యూనియన్ రూ.30వేలు, మొబైల్ వ్యాపారులు రూ.11వేలు, ఎరువుల వ్యాపారులు రూ.10వేలు, ఇతరులు రూ.15వేలు అందజేశారు. కొత్తపూడి శేషగిరిరావు, వెంకటేశ్వరరావు, చింతా నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: ఉంగుటూరు నియోజకవర్గం నుంచి మంగళవారం పలువురు విరాళాలు అందించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నిడమర్రు మండలం పెద నింద్రకొలను దాతలు రూ.2,52,900 మొత్తాన్ని ఎమ్మెల్యే ధర్మరాజుకు అందించారు. నాచుగుంట కొత్తగూడెం పాఠశాల విద్యార్థులు రూ12,500, జల్లికాకినాడకు చెందిన పల్లయ్య రూ.27,583, ఆముదాలపల్లి గ్రామస్తులు రూ 50 వేలు, పిప్పర గ్రామానికి చెందిన సింగంశెట్టి వెంకటేశ్ రూ 25 వేలు, మంతెన సత్యనారాయణరాజు రూ50 వేలు, కేశవరం గ్రామస్తులు వేగెళ్ళ శ్రీనివాసరావు రూ18 వేలు అందించినట్లు కార్యాలయం కార్యదర్శి తెలిపారు.

ముంపుతో నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలి

పోలవరం, సెప్టెంబరు 17: ముంపుతో నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు. రైతు సేవా కేంద్రం వద్ద ఏవో కె రాంబాబు రైతులకు సమాచారం ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం పరిధిలో నష్టపోయిన రైతులు సుమారు 500 మందికి పైగా ఉన్నప్పటికీ పరిహార నమోదులో 125 మందిని మాత్రమే పేర్కొన్నారని మంగళవారం ఆందోళన చేపట్టారు. నష్టపోయిన రైతుల పేర్లు జాబితాలో చేర్చిన తర్వాతే ప్రభుత్వానికి నివేదిక పంపాలని రైతులు డిమాండ్ చేశారు. రైతులు కరిబండి సూర్యచక్రం, నల్లా బాబి, ఎర్రమళ్ళ చక్రం, కామిశెట్టి మురళి, పసుపులేటి క్రిష్ణయ్య, తొత్తల చిన్ని, కాపా వెంకన్న, మిరియాల అంజిబాబు తదితరులు పాల్గొన్నారు. దీనిపై ఏవో రాంబాబును వివరణ కోరగా మండలంలో రెవెన్యూ, పంచాయతీ, వ్యవసాయశాఖ సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలన చేసి జాబితా సిద్ధం చేశామని, బాధిత రైతులు తమ దృష్టికి తెస్తే పరిశీలించి అర్హులైన రైతులకు పరిహారం అందిస్తామని తెలిపారు.

ఎమ్మెల్యే చింతమనేని చొరవతో బాధితులకు న్యాయం

ఏలూరు రూరల్, సెప్టెంబరు 17: ఏలూరులో వైద్యుడి నిర్లక్ష్యంతో ప్రశ్నార్థకంగా మారిన ఇద్దరు చిన్నారులకు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చొరవతో న్యాయం జరిగింది. దెందులూరు నియోజకవర్గంలోని పెదవేగిమండలం, వేగివాడ గ్రామానికి చెందిన చలమాల నాగరాజు కుమారుడు జగదీశ్ ప్రమాదంలో గాయపడగా ఏలూరులోని ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించారు. సూర్యపేట గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ మాగంటి వెంకటేశ్వరరావు కుమారుడు పూర్ణ బైక్ ప్రమాదంలో గాయపడగా గతంలో అదే ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేశారు. వైద్యం వికటించి బాలురు ఇద్దరు కూడా ఎన్నో ఇబ్బందులకు గురయ్యారు. ఇటీవల బాధితుల కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే చింతమనేనికి తమ దీనస్థితిని విన్నవించారు. ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే నేరుగా రంగంలోకి దిగడంతో ఆసుపత్రి యాజమాన్యం బాధిత చిన్నారులకు నష్టపరిహారంగా చెరొక రూ.5 లక్షల తల్లిదండ్రులకు అందజేసింది. మెరుగైన చికిత్స నిమిత్తం చెరో లక్ష ఇస్తామని ఆసుపత్రి యాజమాన్యం హామీ ఇచ్చింది. ఆసుపత్రి యాజమాన్యం బాధితులకు అండగా నిలబడడం అభినందనీయమని ఎమ్మెల్యే చింతమనేని అన్నారు. బాలలకు ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో బొప్పన సుధ, కొనకళ్ళ శివమణి, తాతా సత్యనారాయణ, సత్యనారాయణ, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాజీవ్ నగర్ కాలనీలో సమస్యలు పరిష్కరించండి

బుట్టాయగూడెం, సెప్టెంబరు 17: మండల కేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీలో సమస్యలను పరిష్కారించాలని కోరుతూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో పేదలు, గ్రామ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అందుగుల ఫ్రాన్సిస్, పేదలు మాట్లాడుతూ కాలనీలో 50 ఏళ్ల క్రితం ఏర్పాటుచేసిన 11 కేవీ విద్యుత్ లైన్ ఇళ్ల పైనుంచి వెళ్ళడం వలన వర్షాకాలంలో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. విద్యుత్ లైన్‌ను మార్చాలని కోరారు. కాలనీలో కమ్యూనిటీ హాలు నిర్మించాలని కోరారు.









ఏలూరులో స్వచ్ఛతా హి సేవా ర్యాలీలో మున్సిపల్ ఉద్యోగులు, దెందులూరులో డబ్బాలు పంపిణీ చేస్తున్న చింతమనేని, చింతలపూడిలో చీపుర్లతో శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే రోషన్, గుండుగొలనులో ఎమ్మెల్యే ధర్మరాజు ప్రతిజ్ఞ

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్య పరిరక్షణ

స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు ప్రారంభం

దెందులూరు, సెప్టెంబరు 17: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యమని, గ్రామాల్లో స్వచ్ఛత అందరి బాధ్యత అని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దెందులూరులో స్వచ్ఛతా హి కార్యక్రమం మంగళవారం ఆయన ప్రారంభించారు. నిరంతరం పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు రియల్ హీరోలన్నారు. ఇంటింటికి వెళ్లి పొడిచెత్త, తడి చెత్త సేకరణకు డబ్బాలను ఎంపీడీవో శ్రీలత, తహసీల్దార్ సుమతితో కలిసి పంపిణీ చేశారు. పారిశుధ్య పరిరక్షణకు అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు, ప్రజలు భాగస్వామం కావాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ తోట ఏసమ్మ, ఎంపీటీసీ శేషారత్నం, టీడీపీ మండల అధ్యక్షుడు మిల్లుబాబు, మోతుకూరి నాని, బోడేటి మోహన్ బాబు, గారపాటి కొండయ్య చౌదరి, యిప్పిలి వెంకటేశ్వరావు, సంగి తిలక్, మహేష్ యాదవ్, జహీర్, దాసే శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

● భీమడోలు: గాంధీజీ కన్న కలలు సాకారమవుతున్నాయని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గుండుగొలనులో నిర్వహించిన స్వచ్ఛతా హి సేవా ర్యాలీలో అయన పాల్గొన్నారు. గ్రామంలో మొక్కలు నాటారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పారిశుధ్య కార్మికులను సన్మానించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. టీడీపీ నేతలు కొండబాబు, పుల్లయ్య నాయుడు, శ్రీనివాసరావు, పెద్దిరాజు, జనసేన నాయకుడు ప్రత్తి మదన్, పుప్పాల శ్రీనివాసరావు, బీజేపీ నాయకుడు ప్రవీణ్ పటేల్, అధికారులు పాల్గొన్నారు.

● చింతలపూడి: ప్రతి గ్రామంలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ఫైర్‌స్టేషన్ సెంటర్ నుంచి బోసుబొమ్మ సెంటర్ వరకు జరిగిన ర్యాలీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కొన్నిచోట్ల చీపురుతీసుకుని కార్యకర్తలతో పరిశుభ్రం చేశారు. నాయకులు, వివిధశాఖల అధికారులు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: మున్సిపల్ కార్యాలయం వద్ద ఛైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేశారు. కౌన్సిలర్లు నంబూరి రామచంద్రరాజు, ఉగ్గం దుర్గాప్రసాద్, తడికమళ్ళ మురళి, నేట్రు సుబ్బలక్ష్మి, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, సచివాలయాల సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు. శ్రీనివాసపురంలో నిర్వహించిన కార్యక్రమంలో జడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ, సర్పంచ్ యడ్లపల్లి రాధికతో కలిసి టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు పాల్గొన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో పి.బ్యూలా, ఎలికే ప్రసాద్, కార్యదర్శి శ్రీనివాసరావు, ఎంపీటీసీ జె.తాతారావు, పి.సత్యనారాయణ, అంజి, శ్రీను చిన్ని తదితరులు పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల: మండలంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు నిర్వ హించారు. ద్వారకాతిరుమల ఆలయ ప్రాంగణాన్ని, పరిసరాలను దేవస్థానం ఈవో వేండ్ర త్రినాథరావు పర్యవేక్షణలో అధికారులు, సిబ్బంది శుభ్రం చేశారు. దేవాలయ సిబ్బందికి వచ్చే నెల 2న హెపటైటిస్ బి వాక్సిన్ ఉచితంగా వేస్తామన్నారు. ఈఈ డీపీఎస్ భాస్కర్, డీఈలు టి.సూర్యనారాయణ, ఎస్‌వీఎస్ రాజు, ఏఈవోలు నటరాజారావు, వాసు పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: గ్రామాలు స్వచ్ఛంగా ఉండేందుకు ప్రతీ ఒక్కరు కృషి చెయ్యాలని ఎంపీపీ కొర్స పోశమ్మ అన్నారు. పాఠశాల విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై ఎంఈవో కె.శ్రీనివాస్ అవగాహన కల్పించారు. సర్పంచ్ చిర్రి జగదాంబ, పసుపులేటి రాము, ఎంపీడీవో కేఎల్‌వీ.ప్రసాద్, కోలా మధు, శాఖమూరి సాయి, ఈవోపీఆర్డీ నిఖిల్, హెచ్ఎం చంద్రావతి ఉన్నారు.

● కామవరపుకోట: మండలంలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించి ర్యాలీలు, ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీవో కె.శ్రీదేవి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. కామవరపుకోటలో సర్పంచ్ కరిపోతు అనూష, కార్యదర్శి జీడీవీ.శ్రీనివాసరావు, పలు గ్రామాల్లో ర్యాలీలు, అవగాహన ప్రదర్శనలు నిర్వహించారు.

● పెదవేగి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పెదవేగి సర్పంచ్ తాత శ్రీరామమూర్తి అన్నారు. మండల పరిషత్ వద్ద పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ ప్లకార్డులతో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● ఉంగుటూరు: ఉంగుటూరు, నిడమర్రు మండలంలో స్వచ్ఛత ర్యాలీలు నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

● ఏలూరు రూరల్: మాదేపల్లిలో పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మానవహారం ఏర్పాటు చేశారు. కార్యదర్శి సుమలత, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● పోలవరం: మండల కేంద్రంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో జి.శ్రీను, సర్పంచ్ పొడుం పుష్ప, కోరశిక శ్రీనివాస్, కామి శెట్టి నాగరాజు, కరిబండి నాగరాజు, బొరగం వెంకటలక్ష్మి, కొణతాల ప్రసాద్, కుడిదాల శ్రీను, నల్లా రాంబాబు, పోతుల శ్రీను పాల్గొన్నారు.









ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో విద్యార్థుల మానవహారం, జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ, కామవరపుకోట, జీలుగుమిల్లిలో పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ

సీతారాం ఏచూరి, ఆర్ఎస్ మృతి తీరని లోటు



కైకరంలో మాట్లాడుతున్న లింగరాజు

టి.నరసాపురం, సెప్టెంబరు 17: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, మాజీ ఎమ్మెల్యే ఆర్ఎస్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ అన్నారు. అనుమోలు మురళి అధ్యక్షతన వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సంతాప సభ నిర్వహించారు. ఏచూరి, ఆర్ఎస్‌లో చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఏచూరి కమ్యూనిస్టు ఉద్యమంలో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. దేశం, ప్రజలు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న తరుణంలో సీతారాం లేకపోవడం తీరని లోటన్నారు. ఆర్ఎస్ మృతి జిల్లా ఉద్యమానికి తీరని లోటన్నారు. నేడు దేశవ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమాలలో వ్యవసాయ కార్మికులు, రైతులు పెద్దఎత్తున పాల్గొనాలని, అదే వారికి నిజమైన నివాళి అన్నారు. బి.కుమారి, ముత్తమ్మ, పి.చెల్లమ్మ, అగ్గిరాముడు, శిరీష తదితరులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: భారత దేశం గర్వించదగ్గ మేధావి సీతారాం ఏచూరి అని పలువురు వక్తలు పేర్కొన్నారు. కైకరంలోని ప్రజా సంఘాల నాయకులు మంగళవారం వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్.లింగరాజు, గుత్తికొండ వెంకట కృష్ణారావు, కొర్ని అప్పారావు, సీరా అప్పారావు, అంగన్వాడీ వర్కర్ల సంఘ నాయకులు కమ్ముల పద్మ, వంగపండు పద్మ, జాజుల కనకదుర్గ తదితరులు నివాళులర్పించారు.

దేవాలయ భూములను పరిరక్షించాలి

బుట్టాయగూడెం, సెప్టెంబరు 17: జిల్లాలో దేవాలయ భూములను సంబంధిత అధికారులు పరిరక్షించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి విక్రమ్ కిశోర్ డిమాండ్ చేశారు. రామన్నగూడెం సీతారామస్వామి దేవస్థానం ఆవరణలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రామన్నగూడెంలో సీతారామస్వామివారి దేవస్థానం భూమి ఆక్రమణలకు గురైనట్లు తెలిపారు. ఆక్రమణలను తొలగించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. దేవాలయ భూములను కాపాడాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి సోము హరినారాయణ సంబంధిత అధికారులకు లిఖితపూర్వకంగా తెలియజేసినా చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఆక్రమణలకు గురైన భూములను వెనక్కి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బి.నిర్మలకిషోర్, కె.కృష్ణప్రసాద్, కట్టా సత్యన్నారాయణ, వంకా కాంచనమాల, కొండేపాటి రామకృష్ణ, నియోజకవర్గ, ఏజెన్సీ మండలాల నాయకులు పాల్గొన్నారు.

హిందీ దినోత్సవ పోటీల్లో విజేతలకు బహుమతులు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 17: పవర్‌పేటలోని హిందీనికేతన్‌లో మంగళవారం హిందీ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. హిందీ సాహిత్యాన్ని తెలుగువారికి, తెలుగు సాహితీ విలువలను హిందీవారికి అందించడానికి అనేక గ్రంథాల అనువాదాలను సాగించిన పిన్నింటి సత్యనారాయణ సేవలను వక్తలు కొనియాడారు. వక్తృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన తనూజ, పూర్ణిమ, లలితాశ్రీ, ఆర్విసింగ్, సంతోష్, మనస్వి, సింధు మాధురి, పవన్‌సాయి, దేవి సౌజన్య, పుష్కల, డాన్సీ మహలక్ష్మిలకు బహుమతులు అందజేసారు. ఎల్.వెంకటేశ్వరరావు, దొంతంశెట్టి విశ్వేశ్వరరావు, రామారావు జడ్జీలుగా వ్యవహరించారు.

మోదీ పాలనలో దేశాభివృద్ధి

ప్రధాని జన్మదిన వేడుకలు



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

బుట్టాయగూడెం, సెప్టెంబరు 17: భారత దేశాభివృద్ధి ప్రధాన మంత్రి మోదీతోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా బుట్టాయగూడెంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరం, రక్తదాన శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే బాలరాజు ప్రధానికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆసుపత్రి వైద్యులు 210 మందికి వైద్యపరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. 20 మంది రక్తదానం చేశారు. కరాటం వెంకట రెడ్డినాయుడు, నిర్మల కిశోర్, కరాటం సాయిబాబా, మాలతి, విక్రమ్ కిషోర్, కొండేపాటి రామకృష్ణ, మెట్ట బుచ్చిరాజు, ఆడపా నాగరాజు, సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

● కామవరపుకోట: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా మంగళవారం పలు గ్రామాల్లో పూజలు, గోత్రనామాలతో దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. బీజేపీ కన్వీనర్ ఒంటెద్దు ఏసువరప్రసాద్, వీహెచ్‌పీ నాయకులు కాకి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలాసిగూడెం, కామవరపుకోటలోని వీరభద్రస్వామి ఆలయం వద్ద, తడికలపూడి, కళ్ళచెరువు, రావికంపాడు తదితర గ్రామాల్లో ప్రధాని మోదీ పేరుతో అభిషేకాలు, అర్చనలు చేశారు.

● భీమడోలు: ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా భీమడోలులో బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. బీజేపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ పటేల్ ఆధ్వర్యంలో తొలుత వేంకటేశ్వరస్వామి రూపక దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భీమడోలు హైస్కూలులో మొక్కలు నాటారు. నాయకులు కృష్ణకుమారి, శ్రీనివాస శాస్త్రి, వెజ్జు ధర్మారావు, కపిరాజు, ఉండి రాఘవ, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

● పోలవరం: బీజేపీ ఆధ్వర్యంలో కూటమి నాయకులు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించారు. బీజేపీ నాయకులు కరిబండి నాగరాజు, మండల అధ్యక్షుడు కామిశెట్టి నాగరాజు మోదీ నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలు చేశారు. బొరగం వెంకటలక్ష్మి, కొణతాల ప్రసాద్, కుడిదాల శ్రీను, అనిశెట్టి రాధాకృష్ణ, నల్లా రాంబాబు, పోతుల శ్రీను, దత్తిదేవి, చాపర్ల వెంకటాచలం పాల్గొన్నారు.

● లింగపాలెం: ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి వైపు పురుగులు తీస్తుందని బీజేపీ నాయకులు అన్నారు. ధర్మాజీగూడెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. దేశంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత నరేంద్రమోదీకే చెల్లిందని, పేదల సంక్షేమమే ప్రధాని ధ్యేయమన్నారు. కుర్రా సుబ్రహ్మణ్యేశ్వర వరప్రసాద్, రాయంకుల చక్రధర్‌రావు, ఒంటెద్దు ప్రసాద్, పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

● ఏలూరు క్రైం: ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు రక్తదానం చేశారని రెడ్‌క్రాస్ ఛైర్మన్ బీవీ కృష్ణారెడ్డి తెలిపారు. 18 మంది విద్యార్థులు వచ్చి రక్తదానం చేశారన్నారు. డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె వర ప్రసాదరావు, ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.







చింతలపూడిలో మాత్రలు వేస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, భీమడోలు, పోలవరంలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది

విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ

పెదపాడు, సెప్టెంబరు 17: వట్లూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు మంగళవారం నులి పురుగుల నిర్మూలన మాత్రలు వేశారు. ఐసీడీఎస్ సీడీపీవోలు పద్మావతి, సునీల్ రాజశేఖర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వైద్య సిబ్బంది సహకారంతో నులిపురుగుల నిర్మూలన మాత్రలను అందజేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి భారతి, ఎంఈవో సబ్బితి నరసింహామూర్తి, ఆర్బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారి నరేంద్రకృష్ణ, బొప్పన నరేష్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

● పెదవేగి: స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సర్పంచ్ తాత శ్రీరామమూర్తి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. నులి పురుగులను నివారించకపోతే పిల్లలు అనారోగ్యం పాలవుతారని, ప్రతి ఆరు నెలలకు ఒకసారి నులిపురుగుల నివారణ మాత్రలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ప్రసాద్, ఏఎన్ఎం మౌనిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


● భీమడోలు: మండలంలో భీమడోలు, గుండుగొలను, పూళ్ళ తదితర గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. గుండుగొలను పీహెచ్‌సీ పరిధిలో 10,646 మంది పిల్లలకు పంపిణీ చేశారు. ఏఎన్ఎంలు, సిహెచ్‌వోలు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

● పోలవరం: మండలంలో ఎల్ఎన్‌డీపేట పీహెచ్‌సీ పరిధిలో పాఠశాల విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. మండలంలో 2,234 మంది విద్యార్థులకు మాత్రలు వేశారు. పూనెం లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: చాటపర్రు జడ్పీపాఠశాలలో విద్యార్థులకు ఆల్‌బెండాజోల్ మాత్రలను పంపిణీ చేశారు. టీడీపీ నేతకె.శ్రీనాథ్, ఎంపీహెచ్‌వో రామాంజనేయులు హెల్త్‌సూపర్‌వైజర్ కిరణ్, ఏఎన్ఎమ్ సంధ్యారాణి, ఆశావర్కర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● చింతలపూడి: నులి పురుగుల వల్ల అనారోగ్య అనర్థాలు సమస్యలు ఉంటాయని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ముళ్ళగిరి నాగేశ్వరరావు అన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా హైస్కూల్ విద్యార్థులకు ఆల్‌బెండాజోల్ మాత్రలు పంపిణీ చేశారు. నులి పురుగుల వల్ల రక్తంలో హిమోగ్లోబిన్ తగ్గిపోవడం, చదువుపై శ్రద్ధ చూపలేకపోవడం, శరీరంపై మచ్చలు ఏర్పడటం, తరుచు కడుపులో నొప్పి రావడం జరుగుతుందన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, దానివల్ల అనేక రోగాలను అరికట్టవచ్చని తెలిపారు. ఆయనతో పాటు అర్బన్ పీహెచ్‌సీ డాక్టర్ కె.అనిల్‌కుమార్, కుమారి, లావణ్య, బాలరాజు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మద్ది ఆంజనేయుడి ఆలయంలో ప్రత్యేక పూజలు



జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 17: గురవాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ సేవల రూపేణ స్వామివారికి రూ.1,18,100 ఆదాయం వచ్చినట్లు ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. మద్ది క్షేత్రంలో స్వచ్ఛతాహి సేవ, స్వచ్ఛ భారత్ దివస్ ఉత్సవ్ కార్యక్రమాన్ని ఈవో ఆకుల కొండలరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

అభయాంజనేయుడి ఆలయంలో..

పెదపాడు: అప్పనవీడు అభయాంజనేయస్వామిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. అభయాంజనేయస్వామిని ఆలయ పండితులు ప్రత్యేక అలంకరణ చేసి కుంకుమార్చనలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఆలయం వద్ద సుమారు 200 మందికి అన్న సమారాధన నిర్వహించినట్లు ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు.

సీఆర్ఆర్ విద్యార్థులకు పూర్వ విద్యార్థుల సాయం

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 17: సీఆర్ఆర్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘ దినోత్సవాన్ని మంగళవారం కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. కళాశాల పూర్వ విద్యార్థి, ఎమ్మెల్లే బడేటి చంటి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇద్దరు విద్యార్థులకు ఆర్థికసాయం చేస్తానని ప్రకటించారు. సీఆర్ఆర్ విద్యాసంస్థల కార్యదర్శి మాగంటి ప్రసాద్ మాట్లాడుతూ తానుకూడా ఇదే కళాశాలలో విద్యనభ్యసించానన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో రూ.5వేలు చొప్పున 80మందికి నగదు ప్రోత్సాహక చెక్కులను అందజేశారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, ప్రిన్సిపాల్ రామరాజు, ఎం.వి.కృష్ణారావు, వెన్నవల్లి సత్యనారాయణ, కాకరాల వేణుబాబు, జీపీ రావు, వి.మురళీ మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ దరఖాస్తు గడువు పొడిగించాలి

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 17: ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తు చేసుకునే గడువు పొడిగించాలని డెమొక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు కోరారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు, వరదల కారణంగా వివిధ జిల్లాల్లో పాఠశాలలకు సెలవులు ప్రకటించిన దృష్ట్యా దరఖాస్తు గడువు పొడిగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రేపు మండల స్థాయి క్రీడా ఎంపిక పోటీలు

పెదవేగి, సెప్టెంబరు 17: మండల స్థాయి క్రీడాపోటీలను ఈనెల 19న నిర్వహిస్తున్నామని ఎంఈవో-1 సీహెచ్.బుధవాస్ తెలిపారు. మానవ వనరుల కేంద్రంలో మంగళవారం పోటీల వివరాలను తెలిపారు. మండలస్థాయిలో జరిగే ఎస్జీఎఫ్ క్రీడాపోటీలను పెదవేగిలోని ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. కబడ్డీ, షటిల్, ఖోఖో, వాలీబాల్, చదరంగం, యోగా, బాల్ బాడ్మింటన్, అథ్లెటిక్ పోటీలు ఉంటాయని ఆయన చెప్పారు.

ఇద్దరు ఎంఈవోలు యథాతథం : డీఈవో

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 17: మండలానికి ప్రస్తుతం వున్న ఇద్దరు ఎంఈవోల విధానం కొనసాగుతుందని డీఈవో అబ్రహం మంగళవారం తెలిపారు. 'ఇక ఇద్దరు ఎంఈవోలస్థానే ఒకరికే పరిమితం' శీర్షికన ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. ఎంఈవో-1, 2 లిద్దరూ యదావిధిగా విధులు నిర్వర్తిస్తున్నారని వివరించారు. అన్ని వసతులతో కూడిన ఉన్నత పాఠశాలను స్కూల్ కాంప్లెక్స్ కింద మ్యాపింగ్ ప్రక్రియ ఏదీ చేయడం లేదని ఆయన వివరించారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 17: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రధాన మంత్రి కౌశల్ వికాశ్ యోజనలో ఆఫీస్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ కోర్సులో మూడు నెలల ఉచితశిక్షణ ఇవ్వనున్నారు.స్థానిక డీఎల్‌టీసీ/ఐటిఐ అసిస్టెంట్ డైరెక్టర్ రవి మంగళవారం వివరాలు తెలిపారు. ఇంటర్, ఆపైన విద్యార్హతలుండి, వయస్సు 15నుంచి 30ఏళ్లలోపు వయసు వారు ఈ నెల 25లోగా ఫోన్‌నెంబరు 94934 82414లో సంప్రదించాలని సూచించారు.

క్రైం సమాచారం..

- **జంగారెడ్డిగూడెం :** వాహనంపై తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై ఎస్.కె.జబీర్ తెలిపారు. టాటా మ్యాజిక్ వాహనంలో తరలిస్తున్న 345 కేజీల రేషన్ బియ్యాన్ని గుర్తించి వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సీఎస్ డీటీ వైవి.లక్ష్మీకుమారికి అప్పగించగా వక్కలగడ్డ అరవింద్ కుమార్, పంపన శ్యామ్‌బాబు, కె.కాశీ ఫణి కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.
- జంగారెడ్డిగూడెంలో మద్యం విక్రయిస్తున్న గుళ్ళ ధర్మారావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.కె.జబీర్ తెలిపారు. అతని వద్ద రూ.7150 విలువైన 37 మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.
- జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామానికి చెందిన సొలస దుర్గాప్రసాద్ ఈ నెల 15 వ తేదీ ఆదివారం నుండి అదృశ్యమైనట్లు అతని సోదరుడు సొలస నాగరాజు తెలిపారు. లక్కవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు నాగరాజు తెలిపారు.
- **జీలుగుమిల్లి :** పి.రాజవరం శివారు కాలువ నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తుండగా ఎస్సై పి.నవీన్‌కుమార్‌కు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు.
- జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెంలో నాటు కోళ్ల ఫారంలో కోడి పుంజులు దొంగిలిస్తున్న ముగ్గురు వ్యక్తులపై బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై పి.నవీన్ కుమార్ కేసు నమోదు చేశారు.









చాట్రాయి.. కలిదిండిలో మానవహారం.. కైకలూరులో ప్రతిన.. మండవల్లిలో ర్యాలీ

పల్లెల పరిశుభ్రతే ధ్యేయం కావాలి

అపరిశుభ్రత వల్లే ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని, అందువల్ల గ్రామాల పరిశుభ్రతకు ప్రజలంతా భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు. స్వచ్ఛభారత్ దినోత్సవం సందర్భంగా సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 వరకు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ర్యాలీలు, మానవహారాలు నిర్మించి ప్రజలకు అవగాహన కల్పించారు.

▸స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో వక్తలు ▸ర్యాలీలు, మానవహారాలతో ప్రజలకు అవగాహన

చాట్రాయి, సెప్టెంబరు 17: పల్లెలను పరిశుభ్రంగా ఉంచటం అందరి లక్ష్యం కావాలని జిల్లా టీడీపీ లీగల్ కార్యదర్శి అత్తులూరు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చిన్నంపేటలో మంగళవారం జరిగిన స్వచ్ఛతా హీ సేవ ర్యాలీ, మానవహారంలో ఆయన మాట్లాడుతూ అక్టోబరు 2 వరకు జరిగే స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలలో ప్రజలంతా భాగస్వాములు కావాలని, గ్రామాల్లో చెత్త కుప్పలు, ఇతర వ్యర్థాలను గుర్తించి ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, యువజన, మహిళా సంఘాలు సహకారంతో శుభ్రం చేయటం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. చాట్రాయి, చనుబండ, పోలవరం, పోతనపల్లి తదితర గ్రామాల్లో ర్యాలీలు, మానవహారాలు జరిగాయి. ఈవోపీఆర్డీ నాగరాజు, ఏపీఎం శేఖర్, సచివాలయ, ఐకేపీ, ఆరోగ్య శాఖల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం స్వచ్ఛతా హీ సేవ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నూజివీడు పారిశుధ్య మెరుగుదల ఆవశ్యకత, తడి, పొడిచెత్త సేకరణ తదితర అంశాలను వివరిస్తూ పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. అనంతరం గ్రామాల ప్రధాన కూడళ్లల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: మండలంలోని 25 గ్రామాల్లో ర్యాలీలు, మానవహారాలు నిర్వహించి ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించినట్లు ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో అబ్దుల్ సలామ్, ఈవోపీఆర్డీ శేఖర్ తెలిపారు.

ముసునూరు: స్వచ్ఛ గ్రామాల సాధనకు కృషి చేయాలని ఈవోపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం అన్ని గ్రామ పంచాయతీల్లోని సంపద కేంద్రాల్లో నోడల్ అధికారులు, కార్యదర్శుల ఆధ్వర్యంలో వెలుగు, అంగన్‌వాడీలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, పారిశుధ్య కార్మికులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశాలు నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించి, ప్రణాళికబద్ధంగా చేపట్టబోయే కార్యక్రమాలపై వివరించారు.

కైకలూరు నియోజకవర్గంలో..

కైకలూరు, సెప్టెంబరు 17: గ్రామాల్లో పారిశుధ్య పూర్తిస్థాయిలో నిర్మూలనకు అందరూ కృషి చేయాలని ఎంపీపీ అడవి కృష్ణ అన్నారు. మంగళవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా కైకలూరులో గాంధీ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం విద్యార్థులతో మానవహారం, ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీవో ఉమమహేశ్వరరావు, సర్పంచ్ డీఎం నవరత్నకుమారి, ఈవోపీఆర్డీ రవిశంకరరావు, ఎంఈఓ రామారావు, కూటమి నాయకులు పోలవరపు లక్ష్మీరాణి, కీర్తి వెంకటరాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: మండలంలో పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తూ కూటమి నాయకులు, సర్పంచ్‌లు, అధికారుల ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీలు, మానవ హారాలు నిర్వహించారు. ఎంపీడీవో మల్లీశ్వరి, ఈవోపీఆర్డీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పలు పంచాయతీల్లో పారిశుధ్య పనులు జరిగాయి.

కలిదిండి: కలిదిండి జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంపై అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. తహసీల్దార్ రామకృష్ణ, ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కోరుకొల్లులో కూటమి నాయకులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ కనకదుర్గ, కూటమి నాయకులు కేశిరెడ్డి బలరామ్, వలవల రామారావు, ఎంపీటీసీ రమాదేవి పాల్గొన్నారు.

మండవల్లి: మండవల్లిలో సర్పంచ్ మెండా ఝాన్సీ సురేష్‌బాబు అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏవో జూపుడి శ్రీనివాసరావు, కార్యదర్శి కొండలు, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

550 మందికి ఉచిత వైద్య పరీక్షలు



కలిదిండి, సెప్టెంబరు 17 : కలిదిండిలో మంగళవారం బీజేపీ నాయకులు, విజయవాడ స్వర ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి ప్రారంభించారు. శిబిరంలో 550 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యులు రాకేష్ రెడ్డి, లక్ష్మీనారాయణ, స్వరాజ్యం, సురేష్ కుమార్, కృష్ణ చైతన్య వైద్య సేవలందించారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు, టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, బీజేపీ మండల అధ్యక్షుడు నంబూరి బాండు రాజు, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కీర్తి వెంకట రాం ప్రసాద్, రాధా - రంగా మిత్రమండలి అధ్యక్షుడు పన్నాస పూర్ణచంద్రరావు, చిట్టూరి రవీంద్ర, జనసేన నాయకుడు నల్లగోపుల చలపతిరావు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : కామినేని



కలిదిండి, సెప్టెంబరు 17 : పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా కలిదిండిలో ప్రధానమంత్రి ఆవాస యోజన పథకం ద్వారా నిర్మించిన గృహాలను ప్రారంభించారు. అనంతరం ఆంధ్ర, తెలంగాణ రాధా - రంగా మిత్ర మండలి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో మోదీ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. కూటమి నాయకులు జోగిరాజు, వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, నున్న రమాదేవి, గొరిపర్తి సుబ్బారావు, పేటేటి సత్యనారాయణ, కొల్లి బాబి, మేడిశెట్టి సీతారామాంజనేయులు, తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో దినతేజ్‌లు పాల్గొన్నారు.

ముసునూరు: పేదల ఇంటి కలను నేరవేర్చేందుకు కేంద్రం ప్రభుత్వం కృషి చేస్తోందని పార్టీ గ్రామ అధ్యక్షుడు కాట్రు రామస్వామి అన్నారు. మంగళవారం ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని బలివే గ్రామంలో ప్రధానమంత్రి అవాస యోజన పథకం ద్వారా కసగాని నాగలక్ష్మి నిర్మించుకున్న ఇంటిలో అధికారులు, టీడీపీ నాయకులు సంయుక్తంగా గృహప్రవేశ కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో పీఎంఏవై ద్వారా 617 ఇళ్ళు మంజూరు కాగా 241 గృహాల నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నట్లు ఇన్‌చార్జ్ హౌసింగ్ ఏఈ శివ తెలిపారు.

చాట్రాయి: మండలంలోని చీపురుగూడెంలో మంగళవారం పీఎంఎవై పథకంగా నిర్మించిన 2 పక్కా గృహాలకు నాయకులు, అధికారులు గృహ ప్రవేశాలు చేయించారు. లబ్ధిదారులకు టీడీపీ మండల నాయకుడు బొట్టు లక్ష్మణ రావు బిల్లులు విడుదల, ప్రధాన మంత్రి సందేశం పత్రాలు అందజేశారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు తమ్మిశెట్టి లక్ష్మణరావు, హౌసింగ్ ఏఈ శ్రీనివాస్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా బొద్దనపల్లి గ్రామంలో సర్పంచ్ వేణు, బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో రెండు గృహ ప్రవేశాలు జరిగాయి. ఈ గృహాల్లో మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటారు. బొద్దనపల్లి సర్పంచ్ వేణు, ఈదర సర్పంచ్ దొండపాటి ఏసుపాదం, బీజేపీ నాయకుడు కొవ్వలి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎంపై సమగ్ర విచారణకు చర్యలు

ముదినేపల్లి, సెప్టెంబరు 17 : ముదినేపల్లి మండలం పెదపాలపర్రు జడ్పీ హైస్కూల్‌లో అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై సస్పెండై ప్రస్తుతం ఇంగిలిపాకలంక హైస్కూల్ హెచ్ఎం శాంత కుమారిపై సమగ్ర దర్యాప్తు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్‌ను టీడీపీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, హైస్కూల్ ఎస్ఎంసీ ఛైర్మన్ నరసింహమూర్తి, మాజీ ఛైర్మన్ వెంకటేశ్వరరావు కోరారు. మంగళవారం వారు ఎమ్మెల్యేని కలసి హెచ్ఎంపై ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ నెల 19న విచారణ జరుగుతున్నందున అన్ని అంశాలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని కోరారు. దీనిపై తాను కలెక్టర్, డీఈవోతో మాట్లాడి విచారణ సమగ్రంగా జరిగేలా చర్యలు తీసుకుంటానన్నారు.

పీహెచ్‌సీ వైద్యుల సమ్మె

ముదినేపల్లి, సెప్టెంబరు 17 : ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారుల సమ్మెలో భాగంగా మంగళవారం మండలంలోని 3 పీహెచ్‌సీల వైద్యులు విధులను బహిష్కరించారు. ముదినేపల్లి, గురజ, దేవపూడి పీహెచ్‌సీల వైద్యులు ఆరుగురు సమ్మెలో పాల్గొని విజయవాడ ధర్నాకు తరలివెళ్లారు. దీంతో మూడు పీహెచ్‌సీల్లో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాల్లో వైరల్ జ్వరాలు సోకుతున్న సమయంలో పీహెచ్‌సీల వైద్యులు సమ్మె చేస్తుండటం ఆందోళన కలిగిస్తున్నది.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి 50 కేజీల కాజాలు



కైకలూరు, సెప్టెంబరు 17: కైకలూరు చిన్నచెరువుగట్టుపై వేంచేసియున్న శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి 50 కేజీల కాజాలను కైకలూరుకు చెందిన చెక్కా వెంకట సుబ్బారావు అందజేశారు. ప్రతి నెలా 3వ మంగళవారం భక్తులకు ఆలయ కమిటీ బృందం అన్నసమారాధన నిర్వహిస్తుంది. ఈ సందర్భంగా మంగళ వారం జరిగిన అన్నసమారాధనలో భారీగా భక్తులు పాల్గొన్నారు.

దత్తాశ్రమంలో చండీ హోమం

మండవల్లి, సెప్టెంబరు 17: లోకుమూడి దత్తాశ్రమంలో చండీ హోమాన్ని మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి అభిషేకం చండీ హోమం కార్యక్రమాల్ని నిర్వహించారు. దత్తా ఆశ్రమం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గురజాడ ఉదయశంకర్ ఆధ్వర్యంలో హోమాన్ని నిర్వహించారు. దత్తాత్రేయ భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

క్రీడలకు ప్రథమ ప్రాధాన్యమివ్వాలి

నూజివీడు టౌన్, సెప్టెంబరు 17: క్రీడలకు ప్రాధాన్యమిస్తూ విద్యార్థుల మానసిక, శారీరక ఆరోగ్యానికి, వ్యాయామ ఉపాధ్యాయులు కృషి చేయాలని నూజివీడు ఎంఈవో జమలయ్య అన్నారు. మంగళవారం ఎస్.ఆర్.ఆర్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం హేమలత అధ్యక్షతన నూజివీడు ఎస్.ఆర్.ఆర్. బాలుర ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లో కూడా నైపుణ్యం సాధిస్తే మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు లక్ష్మి, వనజ, అన్నామణి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కైకలూరులో ఎమ్మెల్యే కామినేనికి కేక్ తినిపిస్తున్న బీజేపీ నాయకులు



నూజివీడులో మోదీ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా ప్రధాని మోదీ పుట్టినరోజు వేడుకలు

కైకలూరు, సెప్టెంబరు 17: నరేంద్ర మోదీ ప్రధానిగా భారత ఆర్థిక వ్యవస్థను ప్రపంచంలోనే 5వ స్థానానికి తీసుకువెళ్లారని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో ప్రధాని మోదీ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి, బీజేపీ సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే ఉదయం కైకలూరు రామలింగేశ్వరస్వామి ఆలయంలో బీజేపీ నాయకులు పూజలు చేశారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కొరకే కూటమి ప్రభుత్వం ఏర్పడిందని కేంద్రం రాష్ట్రానికి అన్ని విధాల సహాయం చేస్తుందన్నారు. బీజేపీ సభ్యత్వాల నమోదును వేగవంతంగా చేయాలని క్రియాశీల సభ్యత్వం కావాలంటే 100 మందితో సభ్యత్వాలు నమోదు చేసినవారికే లభిస్తుందన్నారు. కన్వీనర్ వేంపాటి విష్ణురావు, పార్టీ నాయకులు కోటప్రోలు కృష్ణారావు, కట్టా వీరరాఘవులు, రాంప్రసాద్, వరప్రసాద్, బాండు రాజు, పేటేటి సత్యనారాయణ, బోయిన బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: ప్రధాని మోదీ పుట్టిన రోజు వేడుకలను ముదినేపల్లి ఎన్‌డీఏ కార్యాలయం వద్ద కూటమి నాయకులు ఘనంగా జరుపుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు కేక్ కట్ చేసి మాట్లాడుతూ దేశ సమగ్రాభివృద్ధికి ప్రధాని చేపట్టిన పథకాలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. బీజేపీ మండల అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నూజివీడు: ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను బీజేపీ పట్టణ అధ్యక్షుడు బోను అప్పారావు ఆధ్వర్యంలో నూజివీడు చిన్నగాంధీబొమ్మ సెంటర్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ కన్వీనర్ జీఆర్కే రంగారావు ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తున్న ఘనత మోదీకే దక్కుతుందన్నారు. తొలుత బీజేపీ పట్టణ అధ్యక్షులు బోను అప్పారావు గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లిపూడి రాజశేఖర్, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శివరాజు వసుంధరాదేవి, జిల్లా కోశాధికారి మాటూరి రవికాంత్, జిల్లా కార్యదర్శి మాగంటి వాసు, జిల్లా కార్యవర్గ సభ్యులు బావరాజు పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.



ముదినేపల్లిలో ఎన్‌డీఏ కార్యాలయంలో కేక్ కట్‌చేసి వేడుకలు

ఆగిరిపల్లి: ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు ఆగిరిపల్లి మండల బీజేపీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా పార్టీ నూజివీడు నియోజకవర్గ కన్వీనర్ రంగారావు పాల్గొని కేక్ కట్ చేసి మాట్లాడుతూ మోదీ ప్రబలమైన నాయకత్వం కోట్లాది మందికి స్ఫూర్తినిస్తుందన్నారు. సభ్యత్వ నమోదు అక్టోబర్ 2 వరకు జరుగుతుందని తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు కొవ్వలి బాబురావు, టీడీపీ ఆగిరిపల్లి టౌన్ అధ్యక్షుడు పామర్తి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



ఆగిరిపల్లి, కైకలూరు విద్యార్థులకు మాత్రలు వేస్తున్న దృశ్యం

నులి పురుగుల నివారణతోనే ఆరోగ్యం

నులి పురుగుల నివారణ దినోత్సవంలో వక్తలు ▸మాత్రల పంపిణీ

చాట్రాయి, సెప్టెంబరు 17: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఎంఈవో బ్రహ్మచారి మాట్లాడుతూ నులిపురుగుల వల్ల రక్తహీనత, కడుపునొప్పి మొదలైన అనారోగ్య సమస్యలు వస్తాయని, అల్బెండా జోల్ ఏడాదికి 2 సార్లు తీసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చునని అన్నారు. ఈవోపీఆర్డీ నాగరాజు, ఎంపీహెచ్‌వో శ్రీధర్, సూపర్‌వైజర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి పీహెచ్‌సీ పరిధిలోని అన్ని పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు అందించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి జ్యొస్తి జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా కలిదిండి పీహెచ్‌సీ పరిధిలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేసినట్లు వైద్యాధికారి సుచిత తెలిపారు. వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ముదినేపల్లి: ముదినేపల్లి, గురజ, దేవపూడి పీహెచ్‌సీల పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు, అంగన్‌వాడీ చిన్నారులకు హెల్త్ ఎడ్యుకేటర్ జోనాతన్, సీహెచ్ఓ ముత్తయ్య హెల్త్ సూపర్‌వైజర్లు మందులు వేశారు.

కైకలూరు: డోడ్డిపట్ల జడ్పీ హైస్కూల్లో సర్పంచ్ చెరుకువాడ బల రామరాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు అల్బెండాజోల్ మాత్రలను అంద జేశారు. సీతనపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి అన్నపూర్ణ నులిపురుగుల వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. మండలంలో 1 నుంచి 19 సంవత్సరాలు వయస్సు కల్గిన వారు 8500 మందికి ఈ మాత్రలను అందజేస్తున్నట్లు తెలిపారు. హెచ్ఎం కె. విష్ణుమూర్తి, వైద్య సిబ్బంది జి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మండవల్లి: మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందును మంగళవారం సర్పంచ్ మెండా ఝాన్సీ సురేష్‌బాబు చేతుల మీదుగా అందించారు. హెచ్ఎం ప్రసాద్, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



చిత్తపూరులో విశ్వకర్మ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం



కైకలూరులో నాట్యరూపంలో హారతిస్తున్న మహిళలు

ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

కైకలూరు, సెప్టెంబరు 17: విశ్వకర్మ భగవాన్ జయంతిని మంగళవారం కైకలూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. భగవానుడికి నాట్యరూపంలో హారతి ప్రదర్శన, మహిళా భక్త బృందం కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకున్నాయి. విశ్వకర్మకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ టేకి వెంకట సత్యనారాయణ, కార్యదర్శి సింహాద్రి రాంబాబు, కోశాధికారి అనుపోజు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి: మండలంలోని చిత్తపూరు, బూరుగ్గూడెం గ్రామాల్లో విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు విశ్వకర్మ పతాకాన్ని ఆవిష్కరించి పూజల అనంతరం మాట్లాడుతూ బ్రహ్మదేవుడి కుమారుడైన విశ్వకర్మ దేవతల రాజభవనాలు, వాహనాలు, ఆయుధాలతో పాటు శ్రీకృష్ణుడు పాలించిన ద్వారకా నగరాన్ని, పాండవులు పాలించిన ఇంద్రప్రస్థాన్ని సృష్టించారన్నారు. హస్తకళకు ఆద్యుడైన విశ్వకర్మ జయంతిని చేతివృత్తిదారులు భక్తిశ్రద్ధలతో జరుపుకోవటం ఆనవాయితీ అన్నారు. విశ్వబ్రాహ్మణులు కుటుంబాలతో పాల్గొని పూజలు చేసి ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి మండల విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అరిగే పిచ్చియ్యచారి ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలు జరిగాయి. కోశాధికారి అద్దంకి వీరబ్రహ్మచారి, సభ్యులు పాల్గొన్నారు.



చెక్కపల్లిలో విశ్వకర్మ చిత్రపటానికి పూజలు చేస్తున్న టీడీపీ నాయకులు తదితరులు

ముసునూరు: చెక్కపల్లిలో విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు కొండపర్వ హరినాథ్‌ప్రసాద్, కార్యదర్శి కూరెల నాగచారి ఆధ్వర్యంలో విశ్వకర్మ చిత్రపటానికి టీడీపీ నాయకులు కాటేపల్లి శ్రీనివాసరావు, తల్లిబోయిన సత్యనారాయణ, మాజీ ఉప సర్పంచ్ కాటేపల్లి సత్యనారాయణ, కూచిపూడి దేవేంద్ర విశ్వకర్మ చిత్రపటానికి పూజలు చేశారు.



బాధితులకు వంట సామగ్రిని అందిస్తున్న త్రివిధ చిన్నారులు

బాధితులకు అండగా చిన్నారులు

నూజివీడు టౌన్, సెప్టెంబరు 17: పెద్దచెరువుకు గండి నేపథ్యంలో దెబ్బతిన్న నిరుపేద కుటుంబాలకు మేము సైతం అంటూ చిన్నారి చేతులు ముందుకు వచ్చాయి. నూజివీడు త్రివిధ పాఠశాల చిన్నారులు సేకరించిన విరాళాలతో పెద్దచెరువు గండి బాధితులకు దుప్పట్లు, వంట సామగ్రిని విద్యార్థులు స్వయంగా అందించారు. సుమారు 25 కుటుంబాలకు రూ.80 వేలు విలువైన దుప్పట్లు, వంట సామగ్రిని అందించారు. ప్రిన్సిపల్ ఎస్.శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నూజివీడు ఎస్.ఆర్.ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ వ్యాయామ ఉపాధ్యాయులు వరద బాధితులైన సుమారు 20 కుటుంబాలకు నిత్యావసర వస్తువులను వితరణగా అందించారు.

సీపీఎం పట్టణ కార్యదర్శిగా బాషా

ఆగిరిపల్లి, సెప్టెంబరు 17: సీపీఎం ఆగిరిపల్లి పట్టణ నూతన కార్యదర్శిగా షేక్ జహంగీర్ బాషా ఎన్నికయ్యారు. సోమవారం జరిగిన పట్టణ నూతన కార్యవర్గ ఎన్నికల్లో బాషాను ఎంపిక చేసినట్లు జిల్లా కార్యదర్శి రాజు తెలిపారు. సహాయ కార్యదర్శిగా నయనవరపు ఉశెక్కయ్య, సభ్యులుగా ఎం.రాజారావు, ఎస్.కోటేశ్వరరావు, కె.గోపాలరావు, ఎస్.శ్రీనివాసరావు, జె.వెంకటేశ్వర్లు, రవిని ఎన్నుకున్నారు. సీపీఎం మండల కార్యదర్శి సీహెచ్. శివనాగరాజు పాల్గొన్నారు.

మంత్రి ఆదేశాలతో గండి పూడ్చివేత



ముసునూరు, సెప్టెంబరు 17: చెక్కపల్లి వద్ద సంధ్య వాగు వరద ఉధృతికి ప్రధాన రహదారికి పడిన గండిని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశాలతో ఆర్‌అండ్‌బీ అధికారులు పూడ్చించారు. డీఈ బాబురావు, ఏఈ అశోక్‌కుమార్‌ల పర్యవేక్షణలో గండిని పూడ్చారు. దీంతో గత 15రోజులుగా ముసునూరు-చెక్కపల్లి గ్రామాల మధ్య రాకపోకలు పునఃప్రారంభమయ్యాయి. మంత్రి పనితీరుపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

డ్రోన్‌తో రైతులకు ఆదా



చాట్రాయి, సెప్టెంబరు 17: డ్రోన్‌తో పురుగు మందులు పిచికారీ చేయిస్తే రైతులకు డబ్బు, సమయంతో పాటు పురుగు మందు కూడా ఆదా అవుతుందని వ్యవసాయాధికారి శివశంకర్ అన్నారు. చాట్రాయిలో మంగళవారం పలువురు రైతుల వరి పైరుపై డ్రోన్‌తో పురుగు మందుల పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా రైతులతో ఏవో మాట్లాడుతూ ఇటీవల వరకు అధిక వర్షాలు కురవటం, ప్రస్తుతం పగటి ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండటం వలన వరిలో దోమపోటు, తెగుళ్ళు సక్రమించే అవకాశం ఉన్నదని రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని అన్నారు. దోమ కనిపిస్తే పైమెట్రోజెన్ 50 శాతం(డబ్ల్యుజి) 120 ఎంఎల్ ఒక ఎకరానికి వాడాలన్నారు. పొట్టకుళ్ళు తెగులు ఉంటే కార్బండిజమ్ 50 శాతం మందును లీటర్ నీటికి 1 గ్రాము కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. తామర పురుగు ఉంటే మోనోక్రోటోపాస్ 1.6 ఎంఎల్ లేదా ఫిప్రోనిల్ 2 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

ఎన్ఆర్ఐ ప్రొఫెసర్ బెహరాకు డాక్టరేట్



ఆగిరిపల్లి, సెప్టెంబరు 17: ఆగిరిపల్లి ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మెకానికల్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న శ్రీమతి నాగ సుధారాణి బెహరాకు విశాఖలోని ఏయూ పీహెచ్‌డీ ప్రదానం చేసింది. ఏయూ మెకానికల్ విభాగం ఆచార్యులు డాక్టర్ పుట్టి శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఎకో ఫ్రెండ్లీ ఎనర్జీ సిస్టంపై ఆమె పరిశోధనలు చేశారు. ఎన్ఆర్ఐ కళాశాల ఛైర్మన్ డాక్టర్ రావి వెంకట్రావు, ప్రిన్సిపాల్ నాగభాస్కర్ తదితరులు ఆమెను అభినందించారు.

పోడియం తొలగింపు

ముదినేపల్లి, సెప్టెంబరు 17 : ప్రభుత్వ కార్యాలయాల్లో బ్రిటిష్ కాలపు రాచరికపు పోకడలను తొలగించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు ముదినేపల్లిలోని సబ్ - రిజిస్ట్రార్ కార్యాలయంలోని పోడియం తొలగించారు. గత 97 సంవత్సరాలుగా ముదినేపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉన్న పోడియంను తొలగించగా మంగళవారం నుంచి సాధారణ ఎత్తులోని తన సీటులో కూర్చుని సబ్ - రిజిస్ట్రార్ మధుబాబు రిజిస్ట్రేషన్లు నిర్వహించారు. పోడియం తొలగించిన అనంతరం తొలి రోజు 12 రిజిస్ట్రేషన్లు జరిగాయి. 1927లో ముదినేపల్లిలో ఏర్పాటైన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం 55 సంవత్సరాలు ఒక భవనంలో నిర్వహించగా, గత 42 సంవత్సరాలుగా ఈ భవనంలో నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు పోడియంపై 31 మంది సబ్ రిజిస్ట్రార్లు విధులు నిర్వహించారు.